www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH | TELUGU | HINDI DAILY

ఆదివారం, 07-06-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :38 Issue : 38 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు వీరే... అధికారికంగా ప్రకటించిన చంద్రబాబు


- తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన
- ముగ్గురి పేర్లను ఖరారు చేసిన టీడీపీ నాయకత్వం

**అమరావతి, జూన్ 6, అశ్వి అప్డేట్స్:**

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తమ రాజ్యసభ అభ్యర్థులను ఖరారు చేసింది. ముగ్గురు అభ్యర్థులతో కూడిన జాబితాను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు శనివారం అధికారికంగా విడుదల చేశారు. జూన్ 18న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ తరపున సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ బరిలో నిలవనున్నారు. వివరాల్లోకి వెళ్తే, రాజ్యసభ అభ్యర్థులుగా పారిశ్రామికవేత్త సానా సతీష్, ప్రముఖ విద్యావేత్త, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, పార్టీ సోషల్ మీడియా విభాగం ముఖ్య నేతగా ఉన్న చింతకాయల విజయ్‌లను ఎంపిక చేసినట్లు పార్టీ ప్రకటించింది. రానున్న ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై కొంతకాలంగా పార్టీ వర్గాల్లో చర్చలు జరగ్గా, చివరికి అధిష్టానం ఈ ముగ్గురి పేర్లను ఖరారు చేసింది. ఈ ముగ్గురిని చంద్రబాబు ఇవాళ తన క్యాంపు కార్యాలయానికి పిలిపించి స్వయంగా బిఫారాలు అందజేశారు.



వారు సోమవారం నాడు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ మేరకు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం నుంచి అధికారికంగా పత్రికా ప్రకటన వెలువడింది. కాగా, ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవడం తెలిసిందే. కూటమి పొత్తు ధర్మం ప్రకారం నాలుగు స్థానాల్లో ఒకటి జనసేనకు కేటాయించగా, తమ అభ్యర్థిగా జనసేన పార్టీ లింగమనేని రమేష్ పేరును ఖరారు చేయడం తెలిసిందే.




### కోహెడలో అంతర్జాతీయ

# పండ్ల మార్కెట్

### రూ.2,300 కోట్లతో 240 ఎకరాల్లో నిర్మాణం

**హైదరాబాద్ అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక వసతులు**

**రైతులకు లాభం.. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులే లక్ష్యం**

**సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, అశ్వి అప్డేట్స్**

హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపలి ప్రాంతంలో 1.34 కోట్ల జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంత అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయిలో సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలకు అవసరమైన అన్ని సేవలు ఒకేచోట అందుబాటులో ఉండేలా 240 ఎకరాల్లో రూ.2,300 కోట్లతో అత్యాధునిక వసతులతో ఈ మార్కెట్‌ను

మిగతా 2వ పేజీలో..

## ఏఐసీసీలోకి

# తెలంగాణ నేతలు..!

**తెలంగాణకు మరిన్ని కీలక పదవులపై చర్చ**

**కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో కొత్త సమీకరణాలు?**

**ప్రక్షాళనలో జాతీయ బాధ్యతలపై నేతల ఆశలు**

**ప్రస్తుతం ఉన్నవారికి కొనసాగింపు..? కొత్తవారికి అవకాశం..?**

**అధిష్టానం నిర్ణయాలపై కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ**



**హైదరాబాద్, జూన్ 6, అశ్వి అప్డేట్స్:**

దేశవ్యాప్తంగా పార్టీ ప్రక్షాళనకు కాంగ్రెస్ అధిష్టానం సిద్ధమవుతున్న నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ చర్చలు ఊపందుకున్నాయి. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ)లో భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయన్న సంకేతాల మధ్య రాష్ట్రానికి చెందిన పలువురు నేతలకు జాతీయ స్థాయిలో బాధ్యతలు దక్కే అవకాశాలపై పార్టీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ఏఐసీసీ పోస్టుల భర్తీ విషయంలో అన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించడం కాంగ్రెస్ సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో తెలంగాణ నుంచి కూడా పలువురు నేతలకు అవకాశం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం మంత్రి శ్రీధర్ బాబు, మధుయాష్కీ, చిన్నారెడ్డి, వంశీ, సంపత్ తదితరులు ఏఐసీసీ కార్యదర్శులుగా

మిగతా 2వ పేజీలో..



2

**ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్**

భూదందాలో సీఎం కుటుంబీకులు, కాంగ్రెస్ ప్రముఖులు

కల్వకుంట్ల కవిత ఆరోపణలు

## ప్రభుత్వ నిర్లక్ష్యానికి రైతు కనకయ్య బలి

**తడిసిన వడ్లు కొనాలని ప్రాధేయపడితే 40 సంచులు కట్ చేశారు**

**కనకయ్య కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి**

**కోతలు లేకుండా వడ్లను తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్**

**ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన హరీష్ రావు**



**సిద్దిపేట, జూన్ 6, అశ్వి అప్డేట్స్ :**

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, వడ్ల కొనుగోలులో అవకతవకల వల్లే ఇవాళ నారాయణరావుపేట గ్రామానికి చెందిన కనకయ్య అనే రైతు బలి అయ్యాడని సిద్దిపేట ఎమ్మెల్యే, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నాయకుడు హరీష్‌రావు ఆరోపించారు. సిద్దిపేట నియోజకవర్గం నారాయణరావుపేట మండల కేంద్రానికి చెందిన రైతు పల్లెవేని కనకయ్య (గద్దర్) గుండెపోటుతో శనివారం మృతిచెందాడు. ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కనకయ్య మృతి తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చి హరీష్ రావు ఆర్థిక సహాయం

మిగతా 2వ పేజీలో..




### కుటుంబ బంధాల బలోపేతానికి

# మీ సురక్ష

**సీడీఈడబ్ల్యు, ఎఫ్‌సీసీల ఆధ్వర్యంలో నిర్వహణ**

**కుటుంబ వివాదాల పరిష్కారం లక్ష్యం**

**కౌన్సెలింగ్ సెంటర్ల జోక్యంతో ఒక్కటైన 150 జంటలు**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న డీజీపీ ఆనంద్**

**హైదరాబాద్, జూన్ 6:**

మహిళల భద్రత, కుటుంబ సంక్షేమం, వైవాహిక బంధాల పరిరక్షణ లక్ష్యంగా మల్కాజిగిరి కమిషనరేట్ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ డెవలప్మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ (సీడీఈడబ్ల్యు) - ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్స్ (ఎఫ్‌సీసీ)

మిగతా 2వ పేజీలో..



**సెమీ కండక్టర్ పరిశ్రమలకు అనుకూలం**

ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా కంపెనీలను ప్రోత్సహించండి

మలేషియా బృందం భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు

2



## విశ్వవేదికపై సింగరేణి జెండా

**మైన్స్ రెస్క్యూ పోటీల్లో ప్రథమ బహుమతి**

**అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త రికార్డు**

**జట్టును అభినందించిన డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్, జూన్ 6, అశ్వి అప్డేట్స్ :**

అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ఖ్యాతిని చాటిన సింగ రేణి రెస్క్యూ జట్టును

మిగతా 2వ పేజీలో..

## నీట్ 2026కు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికార్లకు ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశాలు

**హైదరాబాద్, జూన్ 6, అశ్వి అప్డేట్స్:**

రాష్ట్రం నీట్ 2026 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. సచివాలయం నుండి అదనపు డిజిపి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు,

మిగతా 3వ పేజీలో..





**పచ్చదనంతో పర్యావరణాన్ని కాపాడండి**

3

# బియ్యం ఎగుమతులకు కేంద్రంగా మారాలి

**ఎగుమతి ఆధారిత మిల్లులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు**

**రైస్ మిల్లింగ్ రంగంలో యాంత్రీకరణకు ప్రాధాన్యం**

**ఆధునిక గోదాములు, స్టీల్ సైలోల నిర్మాణానికి పెట్టుబడులు ఆహ్వానం**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 6, అశ్వి అప్డేట్స్:**

తెలంగాణను దేశంలోనే అగ్రగామి వరి ఉత్పత్తి రాష్ట్రంగా నిలిపిన తర్వాత, బియ్యం ఎగుమతులు, ఆధునిక సాంకేతికతలు, విలువ ఆధారిత ఉత్పత్తుల రంగంలో కూడా ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని నీటిపారుదల, పౌర సరఫరాల

మిగతా 2వ పేజీలో..





**పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు**

ప్రధాని నరేంద్ర మోడీ

6



**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే!**

ఇదే తమ మొదటి డిమాండ్..

కొనసాగిస్తాం కూడా..

ప్రవేశ పరీక్షల అవతవకలకు బాధ్యత వహించాల్సిందే

6

## ప్రభుత్వ భూములను పెద్దలకు
# దోచిపెడుతున్న రేవంత్

హైదరాబాద్, జూన్ 6, అశ్వ అప్డేట్స్: రూ.లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దలకు ధారాదత్తం చేస్తున్నదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాలో చురుకుగా ఉన్నారని ఆరోపించారు. అయితే ఈ ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టు వరకు వెళ్లి తాము కాపాడుతామని స్పష్టం చేశారు. హైడ్రా..పేదల కాలనీల్లో దాడులు చేసి ఆ భూములను పెద్దలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. శ్రీఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పైన ప్రాజెక్టు కడుతోందని.. ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారన్నారు. శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని.. దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎంతో మాట్లాడి 200 టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచిందని.. ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ పరస్పర సవాళ్లతో ఒరిగేదేమీ లేదని కవిత విమర్శించారు. తెలంగాణ బరాబర్ ప్రజల జాగీరే అని, పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకున్నామన్నారు. ఇక్కడకు వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పవన్‌కు మద్దతు ఇస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 సీట్లు పోతాయన్నారు. పవన్ కల్యాణ్ 10 ఎకరాలు శిఖం భూమిని కొనుగోలు చేశారని, కోడికుంట సర్వే నం. 706లో శిఖం భూమి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయని, ఆ భూమిని పవన్ తిరిగి ఇచ్చేయాలన్నారు. శిఖం భూమిలో వేసిన కంచెను పవన్ తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.

## సెమీ కండక్టర్ పరిశ్రమలకు అనుకూలం

హైదరాబాద్, జూన్ 6, అశ్వ అప్డేట్స్ : సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా, రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా ప్రపంచ స్థాయి సదుపాయాలతో కూడిన సెమీ కండక్టర్ 'ఎకో సిస్టం'ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మలేషియాపెనాంగ్ డిప్యూటీ సీఎం వైబీ జగదీప్ సింగ్ దియో నేతృత్వంలోని ఆ దేశ అత్యున్నతస్థాయి ప్రతినిధుల బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును శనివారం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలంగాణమలేషియా(పెనాంగ్) మధ్య సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఏఐ, ఇన్నోవేషన్స్, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్ మెంట్ తదితర రంగాల్లో పరస్పర సహకారానికి గల అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు. చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో హైదరాబాద్ అంతర్జాతీయ కేంద్రంగా ఎదుగుతోందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ, ఏరో స్పేస్, డిఫెన్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ తదితర రంగాల్లో తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ రంగాల్లో పెనాంగ్‌కు ఉన్న అనుభవం.. గ్లోబల్ సెమీ కండక్టర్ హబ్‌గా తెలంగాణ ఎదిగేందుకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నాం.. ఇరు ప్రాంతాల మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకెళ్తాం అని వైబీ జగదీప్ సింగ్ దియో పేర్కొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యానికి రైతు కనకయ్య బలి

మొదటిపేజీ తరువాయి

అందించారు. కనకయ్య పండించిన వడ్లను మార్కెట్ యార్డులో దాదాపు 45 రోజులపాటు ఎవరూ కొనకుండా ఆలస్యం చేయగా వర్షానికి వడ్లన్నీ తడిసిపోయాయి. తడిసిన వడ్లను మిల్లుకు తీసుకెళ్లి ప్రాధేయపడితే నాలుగు ట్రాక్టర్ల వడ్లకు గాను 40 సంచుల వడ్లను మిల్లర్లు కట్ చేశారు. 40 సంచుల వడ్లు కట్ చేసిండ్రు అని నిన్న రాత్రి వరకు తోటి రైతులతో, కుటుంబ సభ్యులతో బాధపడుతూ నిద్రలోనే ఆయనకు గుండెపోటు వచ్చి మరణించాడని తెలిపారు. ఇది కచ్చితంగా ప్రభుత్వ హత్యే అని హరీష్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో కూర్చుని 80% - 90% వడ్లు కొన్నామని ప్రభుత్వం చెప్తోంది.. కానీ క్షేత్రస్థాయిలో ప్రతి ఊర్లో ఇంకా 30% నుండి 40% వడ్లు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. వర్షాలు పడుతున్నాయి.. కొన్ని గ్రామాల్లో రెండు నెలలుగా వడ్లు అమ్ముకోలేక మిల్లులు, గోదాముల ముందు లారీలతో రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు.. క్వింటాల్‌కు 4 నుండి 5 కిలోల కోత పెడుతూ రైతుల ఉసురు పోసుకుంటున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పంట పండించడం సులభంగా ఉంది కానీ ఆ పంటను అమ్ముకోవాలంటే రైతులకు నరకం కనిపిస్తోంది అని హరీష్‌రావు విమర్శించారు. కుకునూరుపల్లి దగ్గర ఒక రాజస్థాన్ లారీలో వడ్లు ఎక్కించే ప్రయత్నం చేస్తే ఆ లారీ వడ్లతో సహా రాజస్థాన్ వెళ్ళిపోయిందన్నారు. దుబ్బాక మండలం చేర్యాపూర్‌లో సంచులు ఎత్తకపోవడం వల్ల, అలాగే ఎన్సాన్‌పల్లిలో కూడా కొనుగోలు చేయకపోవడం వల్ల వడ్లు మొత్తం చెదలు పట్టిపోతున్నాయని చెప్పారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ నియోజకవర్గమైన అల్లాదుర్గం మండలం వెంకటాపూర్ గ్రామంలో ఇప్పటివరకు ఒక్క క్వింటాల్ వడ్లు కూడా కొనలేదన్నారు. ఎక్కడి వడ్లు అక్కడే ఉన్నాయని, రేవంత్ రెడ్డి గారు క్షేత్రస్థాయి సమస్యలు వదిలేశారన్నారు. ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలమైంది.. రైతుబంధు ఇవ్వకుండా మోసం చేసింది.. నాలుగు నెలలుగా రాష్ట్రంలో చనిపోయిన రైతులకు రైతుబీమా అందడం లేదు.. దానిని రద్దు చేశారు.. అధికారులు, మంత్రులు ఎవరూ పట్టించుకోవడం లేదు అని విమర్శించారు. ప్రభుత్వం కలెక్టర్ వెంటనే స్పందించి కనకయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని, వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో మాటలు కట్టిపెట్టి ఎలాంటి కోతలు లేకుండా యుద్ధప్రాతిపదికన వడ్లను తక్షణమే కొనుగోలు చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.



# కోహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్

- రూ.2,300 కోట్లతో 240 ఎకరాల్లో నిర్మాణం

మొదటిపేజీ తరువాయి

నిర్మిస్తున్నామని తెలిపారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత ఈ మార్కెట్‌కు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముప్పై, నలభై ఏళ్ల క్రితం రంగారెడ్డి జిల్లా పండ్లు, కూరగాయల సాగుకు ప్రసిద్ధి చెందిందని సీఎం గుర్తు చేశారు. రైతులు కష్టపడి హైదరాబాద్ ప్రజలకు పండ్లు, కూరగాయలు, పాలు సరఫరా చేసేవారని, రియల్ ఎస్టేట్ విస్తరణతో వ్యవసాయ భూములు తగ్గిపోయాయని చెప్పారు. ప్రస్తుతం అనేక అవసరాల కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

రైతులు వరి, మొక్కజొన్న, జొన్న, పత్తి వంటి కొద్ది పంటలకే పరిమితం కావడం వల్ల మార్కెట్‌పై ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.

స్థానిక ప్రజల సహకారంతో ప్రభుత్వం ఈ పండ్ల మార్కెట్ నిర్మాణాన్ని ప్రారంభించిందని, వచ్చే రెండేళ్లలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని సీఎం వెల్లడించారు. నిధుల కొరత లేకుండా గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తామని, వచ్చే డిసెంబర్ నాటికి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

భారత్ ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలకు అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేసిన సీఎం, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఆకర్షించే విధంగా ఆధునిక నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.15 వేల నుంచి రూ.16 వేల కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సరైన సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. అందుకే అత్యాధునిక వసతులతో సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయాలను నిర్మిస్తున్నామని చెప్పారు.

హైదరాబాద్‌లోని 39 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, మెట్రో విస్తరణ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

కోహెడ పండ్ల మార్కెట్ నిర్మాణాన్ని తప్పనిసరిగా పూర్తి చేస్తామని పేర్కొన్న సీఎం, రంగారెడ్డి జిల్లా అభివృద్ధి అంటే రాష్ట్ర అభివృద్ధేనని, రైతును రాజును చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

# కుటుంబ బంధాల బలోపేతానికి మీ సురక్ష

మొదటిపేజీ తరువాయి

ఆధ్వర్యంలో 'మీ సురక్ష - కలసి ఉంటే కలదు సుఖం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కుటుంబ సామరస్యాన్ని పెంపొందించడం, వైవాహిక బంధాలను బలోపేతం చేయడం, మహిళల భద్రతపై అవగాహన కల్పించడం, కుటుంబ వివాదాలను కౌన్సెలింగ్ మధ్యవర్తిత్వం ద్వారా శాంతియుతంగా పరిష్కరించేందుకు ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని సీడీఈడబ్ల్యు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ల జోక్యంతో తిరిగి కలిసిన 150కి పైగా దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా డీజీపీ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ ప్రభుత్వం, పోలీస్ శాఖ అమలు చేస్తున్న మహిళా భద్రత కార్యక్రమాలను వివరించారు. మహిళలు, పిల్లల భద్రత, గౌరవం, సాధికారత ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యతలలో ఒకటని పేర్కొన్నారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, మహిళా పోలీస్ స్టేషన్లు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు, షీ షటిల్స్, సీడీఈడబ్ల్యు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు వంటి కార్యక్రమాలు మహిళల భద్రతను మరింత బలోపేతం చేశాయని తెలిపారు. మీ సురక్ష-కలసి ఉంటే కలదు సుఖం కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, కౌన్సెలింగ్, మధ్యవర్తిత్వం ద్వారా కుటుంబాలను తిరిగి కలపడంలో మహిళా భద్రత విభాగం, మల్కాజిగిరి కమిషనరేట్ చేస్తున్న కృషిని అభినందించారు. సమాజంలో భార్యాభర్తల మధ్య పరస్పర గౌరవం కుటుంబ జీవితానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. మహిళా భద్రతా విభాగం డీజీపీ చారు సిన్హా మాట్లాడుతూ కుటుంబ సంబంధాల బలోపేతానికి భార్య భర్తలు ఇద్దరూ ఓపికతో, విశ్వాసంతో పాటు ఇద్దరి మధ్య అవగాహన అవసరమని చెప్పారు. భరోసా కేంద్రాలు, సీడీఈడబ్ల్యు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు కుటుంబ వివాదాల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ హెడ్ ఎస్.ఎన్.శ్రీదేవి మాట్లాడుతూ వివాహం పరస్పర గౌరవం, అవగాహన, ఆధారపడిన సామాజిక వ్యవస్థ అని చెప్పారు. కుటుంబ వివాదాల పరిష్కారంలో కౌన్సెలింగ్, కీలకమన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి మాట్లాడుతూ, సీడీఈడబ్ల్యు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు కుటుంబ వివాదాల పరిష్కారం, మహిళా సాధికారత, కుటుంబ సంక్షేమానికి సమర్థ వేదికగా మారాయని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎనిమిది ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు పనిచేస్తున్నాయని, ఇప్పటివరకు 9,700కు పైగా కేసులను పరిష్కరించడంతోపాటు 32,000కు పైగా కౌన్సెలింగ్ సెషన్లు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సీడీఈడబ్ల్యులు, మహిళా పోలీస్ స్టేషన్లు కలిసి 377 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 16 వేల మందికి పైగా ప్రజలకు చేరువయ్యాయని, సీడీఈడబ్ల్యు సేవలపై 90 శాతానికి పైగా సంతృప్తి వ్యక్తమైందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తిరిగి కలిసిన దంపతులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కుటుంబ కౌన్సెలింగ్, వివాదాల పరిష్కారం, పునరావాసం, కుటుంబ సంక్షేమంలో విశేష సేవలందించిన ఉత్తమ సీడీఈడబ్ల్యుకేంద్రాలు, కౌన్సిలర్లు, సిబ్బందిని సత్కరించారు. తిరిగి కలిసిన దంపతులు తమ అనుభవాలను పంచుకుంటూ, తమ కుటుంబాలను నిలబెట్టడంలో సహకరించిన కౌన్సెలర్లు, పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మై ఛాయిస్ ఫౌండేషన్ ప్రతినిధి పెర్ల్ చోరగుడి, మహిళా భద్రత డీసీపీ టి.ఉషారాణి, సీనియర్ పోలీస్ అధికారులు, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, షీ టీమ్స్, భరోసా కేంద్రాల ప్రతినిధులు, సీడీఈడబ్ల్యు కౌన్సెలర్లు, భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు, తిరిగి కలిసిన దంపతులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విశ్వవేదికపై సింగరేణి జెండా

మొదటిపేజీ తరువాయి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శనివారం అభినందించారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కను సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్‌తో కలిసి రెస్క్యూ జట్టు మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా వారు సాధించిన ప్రతిష్ఠాత్మక ట్రోఫీలను, మెడల్స్‌ను డిప్యూటీ సీఎంకు అందించారు. భూగర్భ గనుల రక్షణలో తామెప్పుడూ అగ్రగామినే అని సింగరేణి సంస్థ ప్రపంచ వేదికపై మరోసారి నిరూపించిందని భట్టి అన్నారు. జాంబియా దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలలో సింగరేణి రెస్క్యూ జట్టు అద్భుత ప్రదర్శనతో విశ్వవిజేతగా నిలవడం సంతోషకరమని అన్నారు. చైనా, కెనడా, ఆస్ట్రేలియా, పోలాండ్, కొలంబియా వంటి గనులు అధికంగా ఉండే దిగ్గజ దేశాల జట్లతో పోటీపడి ప్రథమ బహుమతి కైవసం చేసుకోవడం గర్వకారణమని అన్నారు. గనుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు రెస్క్యూ సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి అందించే సేవలు అసమానమైనవని కొనియాడారు. సింగరేణిని కేవలం ఒక బొగ్గు ఉత్పత్తి సంస్థగానే కాకుండా, అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలిపేందుకు మా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని డిప్యూటీ సీఎం అన్నారు. గనుల్లో అత్యంత కఠినమైన పరిస్థితుల్లో పనిచేసే మన రెస్క్యూ సిబ్బంది నైపుణ్యం, అంతర్జాతీయ పోటీల ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (పి అండ్ పి) కె. వెంకటేశ్వర్లు, జీఎం (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, రెస్క్యూ జట్టు సభ్యులు, సింగరేణి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏఐసీసీలోకి తెలంగాణ నేతలు..!

మొదటిపేజీ తరువాయి

కొనసాగుతున్నారు. కొత్త నియామకాలలో అధికార ప్రతినిధుల పదవులతో పాటు మరికొన్ని కీలక బాధ్యతల్లోనూ తెలంగాణ నేతలకు ప్రాధాన్యం లభించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

మరోవైపు రాష్ట్ర కేబినెట్ విస్తరణపై జరుగుతున్న ప్రచారం కూడా ఈ చర్చలకు మరింత బలం చేకూరుస్తోంది. మంత్రి వర్గంలో మార్పులు జరిగి ఒకరిద్దరు మంత్రులు తప్పాల్సి వస్తే, వారిని జాతీయ రాజకీయాల్లో వినియోగించే దిశగా అధిష్టానం ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాంటి నేతలకు ఏఐసీసీలో కీలక పదవులు అప్పగించి ఇతర రాష్ట్రాల ఇన్‌చార్జ్‌లుగా బాధ్యతలు ఇవ్వవచ్చని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేస్తూ క్రియాశీలకంగా ఉన్న నేతలకు కూడా ఈసారి అవకాశాలు కల్పించే అవకాశముందని సమాచారం. రాష్ట్ర స్థాయిలో తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్న నాయకులను ఢిల్లీ స్థాయిలో వినియోగించుకోవాలన్న ఆలోచన అధిష్టానంలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఏఐసీసీలో కొనసాగుతున్న నాయకులకు మళ్లీ అవకాశం ఇస్తారా, లేక కొత్తవారికి ప్రాధాన్యం కల్పిస్తారా అన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. పార్టీ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో వారంలోపు కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏఐసీసీ మార్పులు, కేబినెట్ విస్తరణ ప్రచారం, జాతీయ స్థాయి బాధ్యతల అవకాశాల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణాలు రూపుదిద్దుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పార్టీ నేతలందరి దృష్టి అధిష్టానం తీసుకోబోయే నిర్ణయాలపైనే కేంద్రీకృతమైంది.

## కోడిపందాల స్థావరంపై ఎస్ఓటీ మెరుపు దాడి

శంషాబాద్, అశ్వ అప్డేట్స్

శంషాబాద్ మండలంలోని బురుజుగడ్డ తండాలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరంపై ఎస్ఓటీ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. రహస్యంగా కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి స్థావరాన్ని చుట్టుముట్టి అక్రమ వ్యవహారాన్ని బట్టబయలు చేశారు. దాడి సమయంలో కోడిపందాలు కాస్తూ జూదానికి పాల్పడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిర్వహించిన తనిఖీల్లో రూ.3,82,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే పందాలకు ఉపయోగిస్తున్న కోళ్లు, నిందితులు అక్కడికి చేరుకున్న వాహనాలను సీజ్ చేశారు.

కోడిపందాల నిర్వహణను పర్యవేక్షిస్తున్న ప్రధాన నిర్వాహకుడు మాత్రం పోలీసులు రాకను గమనించి పరారైనట్లు అధికారులు తెలిపారు.

# బియ్యం ఎగుమతులకు కేంద్రంగా మారాలి

మొదటిపేజీ తరువాయి

శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ రైస్ అండ్ గ్రెయిన్స్ టెక్ ఎక్స్‌పో2026లో మంత్రి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధిలో రైస్ మిల్లర్లు కీలక భాగస్వాములని పేర్కొన్న మంత్రి, రైతులు, మిల్లర్లు, వినియోగదారులు అందరూ కలిసి అభివృద్ధి ఫలాలను పొందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బియ్యం ఎగుమతులను పెంచేందుకు తెలంగాణలో కొత్తగా ఏర్పాటయ్యే ఎగుమతి ఆధారిత రైస్ మిల్లులకు, అలాగే ప్రస్తుతం పనిచేస్తున్న మిల్లులు ఎగుమతుల వైపు మళ్లేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. ప్రపంచ బియ్యం మార్కెట్లలో తెలంగాణకు ప్రత్యేక స్థానం కల్పించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమన్నారు.

### యాంత్రీకరణ ద్వారానే అభివృద్ధి

రైస్ మిల్లింగ్ రంగంలో కార్మికుల కొరత ప్రధాన సవాలుగా మారిందని పేర్కొన్న మంత్రి యాంత్రీకరణ, ఆటోమేషన్‌కు మిల్లర్లు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా ఉత్పాదకత పెరగడంతోపాటు కార్మికుల కొరత సమస్యను అధిగమించవచ్చన్నారు. స్టీల్ సైలోలు, ఆటోమేటెడ్ గోదాములు, కృత్రిమ మేధస్సు ఆధారిత ధాన్యప్ర పర్యవేక్షణ వ్యవస్థలు, డిజిటల్ ఇన్వెంటరీ నిర్వహణ వంటి ఆధునిక నిల్వ సదుపాయాల నిర్మాణం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రైవేటు భాగస్వామ్య విధానంలో భారీ సామర్థ్యంతో గోదాముల నిర్మాణానికి పెట్టుబడిదారులు ముందుకు రావాలని ఆహ్వానించారు.

### పర్యావరణహిత పార్బాయిలింగ్ సాంకేతికతలు అవసరం

పార్బాయిలింగ్ యూనిట్లలో నీటి వినియోగాన్ని తగ్గించే, విద్యుత్ ఆదా చేసే ఆధునిక సాంకేతికతలను పరిశ్రమలు అవలంబించాలని మంత్రి సూచించారు. భవిష్యత్ ప్రాసెసింగ్ యూనిట్లు నీటి పునర్వినియోగం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

### పోషక విలువలతో కూడిన బియ్యం ఉత్పత్తి

నాణ్యతతోపాటు పోషక విలువలను కూడా దృష్టిలో ఉంచుకుని బియ్యం ప్రాసెసింగ్ జరగాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. నియంత్రిత వైటనింగ్, ప్రిసిషన్ పాలిషింగ్, పోషకాలనుకాపాడే సాంకేతికతలు, ఏఐ ఆధారిత నాణ్యత నిర్ధారణ విధానాలు వినియోగదారులకు మరింత ఆరోగ్యకరమైన బియ్యం అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.

### దేశానికి దిక్సూచి తెలంగాణ

ప్రస్తుతం రాష్ట్రంలో ఏటా సుమారు 300 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి జరుగుతోందని మంత్రి తెలిపారు. దేశంలో యాసంగి వరి కొనుగోళ్లలో తెలంగాణ వాటా దాదాపు 60 శాతం ఉందన్నారు. ప్రస్తుత ఖరీఫ్, యాసంగి సీజన్లలో రైతుల ఖాతాల్లో ప్రభుత్వం దాదాపు రూ.39 వేల కోట్లు జమ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు రూ.96 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేసినట్లు తెలిపారు. అలాగే సన్న బియ్యం పంపిణీ పథకం ద్వారా 3.2 కోట్ల మందికి లబ్ధి చేకూరుతోందని, ఇందుకోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. రైతులు, మిల్లర్లు, సాంకేతిక నిపుణులు, విధాన రూపకర్తలు సమష్టిగా కృషి చేస్తే బియ్యం ఉత్పత్తిలోనే కాక బియ్యం సాంకేతికత, ఆవిష్కరణలు, ఎగుమతుల రంగంలో కూడా తెలంగాణ ప్రపంచస్థాయి కేంద్రంగా ఎదుగుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు.

### చేనేతల సంక్షేమం, అభివృద్ధికి సంపూర్ణ అండ : ఉత్తమ్

### 'థ్రెడ్ పోచంపల్లి' సందర్శన

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళాత్మక నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన పోచంపల్లి ఇక్కత్ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడం ప్రతి తెలంగాణవాసికి గర్వకారణమని మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న 'థ్రెడ్ పోచంపల్లి' ప్రత్యేక ప్రదర్శనలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పోచంపల్లి ఇక్కత్ ఒక వస్త్ర కళ మాత్రమే కాదని, అది తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సృజనాత్మకత, సంప్రదాయ జీవన విధానానికి అద్దం పట్టే అద్భుత కళారూపమని అభివర్ణించారు. రంగుల సమన్వయం, నూలు పోగుల్లో కనిపించే అపూర్వమైన డిజైన్లు, తరతరాలుగా వస్తున్న కళాత్మక నైపుణ్యం వల్ల పోచంపల్లి ఇక్కత్ ప్రపంచ ఫ్యాషన్ రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని చెప్పారు. చేనేత కార్మికుల కష్టం, పట్టుదల, నైపుణ్యం వల్లే పోచంపల్లి పేరు ప్రపంచ పటంలో నిలిచిందని మంత్రి కొనియాడారు. ఒక చీర తయారీ వెనుక కుటుంబమంతా కలిసి చేసే శ్రమ, సృజనాత్మకత, అంకితభావం దాగి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం చేనేత రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమ కార్యక్రమాలు, మార్కెటింగ్ అవకాశాలు, ఆర్థిక సహాయం, శిక్షణ కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. చేనేత ఉత్పత్తుల అమ్మకాల పెరుగుదల ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. పోచంపల్లి పేరు నేడు దేశ సరిహద్దులు దాటి అంతర్జాతీయ స్థాయిలో వినిపించడానికి కారణం చేనేత కార్మికుల ప్రతిభేనని కొనియాడారు. ఈ కళను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. యువత కూడా చేనేత రంగం వైపు ఆకర్షితులయ్యేలా ఆధునిక డిజైన్లు, కొత్త మార్కెటింగ్ విధానాలు, డిజిటల్ వేదికల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసి, ప్రపంచ మార్కెట్లలో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లేందుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు

# పచ్చదనంతో పర్యావరణాన్ని కాపాడండి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 6, అశ్వి అప్డేట్స్ :**
భావితరాల భవిష్యత్తును, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని పచ్చదనాన్ని(గ్రీనరీ డెవలప్‌మెంట్) తప్పనిసరిగా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న బీబీ నగర్ ఎయిమ్స్ హాస్పిటల్ ప్రాంగణంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రస్తుతం జనాభా పెరుగుదల, కాలుష్యం వంటి అనేక కారణాల వల్ల పచ్చదనం క్రమంగా తగ్గిపోతోందని, పెరుగుతున్న ప్రజల అవసరాలను తీర్చేందుకు, మౌలిక వసతుల కల్పన కోసం కొన్ని ప్రాంతాల్లో పచ్చదనం దెబ్బతింటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే ప్రధాన మంత్రి 'ఏక్ పేడ్ మా కే నామ' (అమ్మ పేరిట ఒక మొక్క) అనే గొప్ప పిలుపునిచ్చారంటూ దీని ప్రకారం ప్రతి ఒక్కరూ తమ కన్నతల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని సూచించారు. శుక్రవారం జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం నుండి ప్రారంభమైన ఈ మొక్కలు నాటే కార్యక్రమం ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం వరకు నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. గ్రామ పంచాయతీల్లోని యువత, వార్డు మెంబర్ల నుండి మొదలుకుని దేశ రాష్ట్రపతి వరకు, అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు ఇలా ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొనాలని మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, అడవులు లేదా మీ ఇంటి చుట్టుపక్కల ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ అందుబాటులో ఉన్న ప్రతి చోటా మొక్కలు నాటాలన్నారు. ఈ ఏడాది చివరి వారంలో ఈ ప్రతిష్టాత్మక ఎయిమ్స్ హాస్పిటల్‌ను ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రజలకు అంకితం చేయాలనే ఆలోచనతో ఉన్నామన్నారు. ఈ హాస్పిటల్ పనులు జరుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఇక్కడ కూడా పచ్చదనాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఒక మొక్కను నాటడానికి ఈరోజు తాను ఇక్కడికి వచ్చినట్లు కిషన్‌రెడ్డి చెప్పారు.

## హైడ్రా ప్రజావాణికి మరో రెండు వారాల విరామం

**హైదరాబాద్ జూన్ 6, అశ్వి అప్డేట్స్:**
ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే హైడ్రా ప్రజావాణి కార్యక్రమానికి మరో రెండు వారాల పాటు విరామం ప్రకటించారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జూన్ 8, జూన్ 15 తేదీల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబోమని స్పష్టం చేశారు.
గతంలో వచ్చిన పెండింగ్ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు మే 11 నుంచి వరుసగా నాలుగు సోమవారాల పాటు ప్రజావాణికి విరామం ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నెల 8న కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని భావించినప్పటికీ, ఇంకా కొన్ని పాత ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాల్సి ఉండటంతో గడువును మరో రెండు వారాలు పొడిగించినట్లు కమిషనర్ వెల్లడించారు.
పెండింగ్ దరఖాస్తుల పరిశీలన పూర్తయిన అనంతరం జూన్ 22 నుంచి హైడ్రా ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ మార్పును ఫిర్యాదుదారులు, బాధితులు గమనించాలని హైడ్రా అధికారులు కోరారు.

## 9న మైనారిటీ యువత కోసం మెగా జాబ్ మేళా

**హైదరాబాద్, జూన్ 6, అశ్వి అప్డేట్స్:**
తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జూన్ 9, 2026న నాంపల్లిలోని రెడ్ రోజ్ ప్యాలెస్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ జాబ్ మేళాను మైనారిటీస్ వెల్ఫేర్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, గవర్నమెంట్ రిలేషన్స్ శాఖ మంత్రి జనాబ్ మహమ్మద్ అజారుద్దీన్ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, కస్టమర్ సర్వీసెస్ తదితర రంగాలకు చెందిన 40 నుండి 50 ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయి. మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న మంత్రి అజారుద్దీన్ సంకల్పానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. అర్హత కలిగిన మైనారిటీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ మొహమ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళా ఉద్యోగార్థులను ప్రముఖ కంపెనీలతో అనుసంధానం చేసే ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు.

## మహిళా భవనాల పనుల పురోగతిని పరిశీలిస్తా

- రోజూ వీసీలతో పనుల సమీక్ష
- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు

**హైదరాబాద్, జూన్ 6, అశ్వి అప్డేట్స్:**



గ్రామాల్లో నిర్మిస్తున్న మహిళా భవనాల నిర్మాణ పనుల పురోగతిని ప్రతి రోజూ తాను పరిశీలిస్తానని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. భవనాల నిర్మాణ పురోగతిపై రోజువారీగా వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్ష నిర్వహిస్తానన్నారు. ఉపాధి హామీ పనులు, గ్రామ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్ శాఖ అధికారులతో ఆమె శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క అక్కడి నుంచే ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల శంకుస్థాపన చేసిన ఎనిమిది వేల గ్రామ మహిళా సమాఖ్య భవనాలు కేవలం నిర్మాణాలు కాదని, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలిచే ఆత్మగౌరవ భవనాలు అని పేర్కొన్నారు. వాటి నిర్మాణ పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. భవనాల నిర్మాణ పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించేందుకు వీడియో కాన్ఫరెన్స్‌లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజూ పనుల పురోగతిని తాను స్వయంగా పర్యవేక్షిస్తానని, అవసరమైతే రోజువారీ వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ప్రతి ఎంపీడీవో తమ మండలంలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా వ్యవహరిస్తూ గ్రామాల్లో భవనాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పనుల నాణ్యత, పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను సాధించేలా క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన అమలు జరగాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో పాలమూరుకు ద్రోహం

- తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెట్టే కుట్ర
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్

**మహబూబ్‌నగర్,జూన్ 6, అశ్వి అప్డేట్స్:**
కాంగ్రెస్ పాలనలో అన్ని జిల్లాల కంటే ఎక్కువ నష్టం మహబూబ్‌నగర్ కు జరిగిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆంధ్రా వ్యక్తిని సాగునీటి సలహాదారుగా పెట్టి తెలంగాణకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఏపీకి నీళ్లు తీసుకుపోయి పాలమూరును ఎండబెడతారంట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే టెండర్లు పిలిచి పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నిన్న మంత్రి, ముఖ్యమంత్రి మాటలకు ప్రజల నుంచి స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా చిల్లర మాటలను సీఎం రేవంత్ రెడ్డి మానుకోవాలని హితవు పలికారు. మహబూబ్‌నగర్‌లో శనివారం ఉదయం మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ సీఎం పర్యటన గురించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆశతో ఎదురు చూశారని తెలిపారు. కానీ సీఎం ఇచ్చింది ఏమీ లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి వచ్చి కేసీఆర్ కట్టిన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లను పరిశీలించిన వెళ్లారని తెలిపారు. కర్ణాటక జల దోపిడీకి మనం నిధులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టును సీఎం ఎందుకు వ్యతిరేకించడం లేదని నిలదీశారు. ఇప్పటికే జూరాలకు చుక్కనీరు వస్తలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రాజెక్టులను పడావు పెడుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో చర్చలు కొలిక్కి రాకుండానే బ్యారేజి కమ్ బరాజ్‌లపై ఎలా ఏరియల్ సర్వే చేశారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్వోసీ ఇస్తే బనకచర్లపై సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తానని అంటున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మీరు తిరిగే రిజర్వాయర్లు కట్టింది కేసీఆర్ కాదా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణానికి తట్టెడు మట్టిని కూడా రేవంత్ ప్రభుత్వం తీయలేదని విమర్శించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును డిజైన్ చేసింది 45 కి.మీ కాలువలు అని.. అందులో 41 కి.మీ కాలువలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం రూ.33,500 కోట్ల పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన పనులను కాంగ్రెస్ చేసిందని చెప్పుకుంటారా అని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. పాలమూరురంగారెడ్డి పనుల జాప్యానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

**రెండున్నరేళ్లుగా తట్టెడు మట్టి తీయలేదు : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**

రెండున్నరేళ్లయినా పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో తట్టెడు మట్టి తీయలేదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి విమర్శించారు. ఇప్పుడు పూర్తి చేస్తామని అంటే ఎలా నమ్ముతారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాదయాత్ర చేస్తానని అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం కదిలిందన్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా పాలమూరురంగారెడ్డిపై కాంగ్రెస్ సర్కార్‌కు ప్రేమ పుట్టిందన్నారు. రెండున్నరేళ్లపాటు పాలమూరురంగారెడ్డిని పడావు పెట్టిందని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డికి రేవంత్ రెడ్డి సర్కార్ ఏం చేసిందని ప్రశ్నించారు. ప్రాజెక్టులు పూర్తి చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. 10 శాతం ప్రాజెక్టును పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఏడాది సమయం కావాలని అంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పూర్తి కాలేదని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు చెబుతున్నాడని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌ను కాంగ్రెస్ సర్వనాశనం చేసిందని లక్ష్మారెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగిందని తెలిపారు. ఉత్తమ్ మాటలు అన్ని ఉత్తవే అని ఎద్దేవా చేశారు. పాలమూరు జిల్లా ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి మాటలపై నమ్మకం లేదని లక్ష్మారెడ్డి అన్నారు.

## ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఎదిగిన బీజేపీ

- తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణ
- రామగుండం ఎరువుల కర్మాగారాన్ని పునరుద్ధరించింది కేంద్రమే
- కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కేంద్ర పథకాలు ప్రచారం చేయాలి
- దీన్‌దయాళ్ ప్రశిక్షణ శిబిరంలో రామచంద్రరావు



**హైదరాబాద్, జూన్ 6, అశ్వి అప్డేట్స్:**
రాజకీయాల్లో, సమాజంలో, ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మార్పులను నిరంతరం అధ్యయనం చేస్తూ, కాలానుగుణంగా తనను తాను మలుచుకుంటూ ముందుకు సాగే పార్టీ బీజేపీ. అందుకే ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ ఎదిగిందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. యాదగిరిగుట్టలో పండిట్ దీన్ దయాళ్ ప్రశిక్షణ శిబిరంలో శనివారం ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే 12 సంవత్సరాల పాలన పూర్తి చేశారు. ప్రస్తుత పదవీకాలానికి ఇంకా మూడేళ్లు ఉండగా ఆ తర్వాత కూడా మరో ఐదేళ్లపాటు దేశానికి నాయకత్వం వహిస్తారని విశ్వసిస్తున్నానన్నారు. ఇటీవల హిందూ పత్రిక నిర్వహించిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చాలా ఆశ్చర్యం కలిగించాయన్నారు. ఒకప్పుడు ఏబీవీపీ, ఆర్ ఎస్ ఎస్ నేపథ్యంలో పనిచేసిన వ్యక్తిగా ఆయన మాట్లాడిన తీరు చూస్తే బాధ కలుగుతుందన్నారు. ప్రధానమంత్రి ఉత్తర భారతదేశానికి చెందినవారు, రాష్ట్రపతి ఉత్తర భారతదేశానికి చెందినవారు, హోం మంత్రి ఉత్తర భారతదేశానికి చెందినవారు, రక్షణ మంత్రి ఉత్తర భారతదేశానికి చెందినవారు. వాళ్లకు వెళ్లి నేను సెల్యూట్ చేయాలా? తనకు సిగ్గుగా ఉంటుందని అనడం బాధ కలిగించిందన్నారు. ఈ వ్యాఖ్యలు దక్షిణాది-ఉత్తరాది అనే విభజన భావనను ప్రోత్సహించే విధంగా ఉన్నాయన్నారు. ఇటువంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.మరి ఇదే రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ, సోనియా గాంధీని కలవడానికి, వారి ఆదేశాల మేరకు పనిచేయడానికి వెళ్లలేదా? అప్పుడు మీకు సిగ్గు అనిపించలేదా? అన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణకు వేల కోట్ల రూపాయలు కేటాయించారు. ఇటీవల రూ.7597 కోట్లతో రెండు జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆర్మూర్ - జగిత్యాల మంచిర్యాల హైవేతోపాటు జగిత్యాల కరీంనగర్ హైవేను నాలుగు వరుసలుగా విస్తరించేందుకు ఆమోదించింది. రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ చేసింది. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి ఆమోదం కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. వరంగల్‌లో పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్‌ను మంజూరు చేసింది. జహీరాబాద్‌లో పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు సహకరించింది. పేదలకు ఉచిత బియ్యం అందిస్తోంది. ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసింది. శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏరోస్పేస్, రక్షణ రంగ పరిశ్రమలను తీసుకువచ్చింది.ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు, ఇన్ని నిధులు, ఇన్ని సంస్థలు తెలంగాణకు వచ్చిన తర్వాత కూడా కేంద్రం ఏమీ చేయలేదని రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం అసత్య ప్రచారమేనన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల కాలంలో ఎన్నో వివాదాలు, అవినీతి ఆరోపణలు, కమిషన్ వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేసిన గొప్ప పని ఏమిటో చెప్పలేని పరిస్థితి ఉంది. హైదరాబాద్ నగర అభివృద్ధిలో కూడా కేంద్ర ప్రభుత్వ పాత్ర కీలకంగా ఉంది.రాబోయే రోజుల్లో జీహెచ్‌ఎంసీ, మల్కాజ్ గిరి, సైబరాబాద్ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి వాటిని ఆదర్శ నగరాలుగా తీర్చిదిద్దుతాం. స్వనిధి పథకం ద్వారా హైదరాబాద్ నగరంలో కూడా వేలాది మంది స్ట్రీట్ వెండర్లు లబ్ధి పొందుతున్నారు. స్వచ్ఛ భారత్, స్వనిధి, అమృత్ వంటి పథకాలతో పాటు వివిధ పథకాలతో హైదరాబాద్ నగర సుందరీకరణకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకరిస్తోందన్నారు. ఈ శిక్షణ తరగతులు పూర్తయ్యాక ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయికి వెళ్లాలి. ప్రజల మధ్యకు వెళ్లాలి. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో చురుకుగా పాల్గొనాలి. అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు చేయించాలి. దొంగ ఓట్లను తొలగించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి అని దిశానిర్దేశం చేశారు.

## త్వరలో సనత్‌నగర్ టిమ్స్ ప్రజలకు అంకితం



- ఏర్పాట్లను సమీక్షించిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్

**హైదరాబాద్, జూన్ 6, అశ్వి అప్డేట్స్ :**
సనత్‌నగర్‌లో నిర్మించిన అత్యాధునిక టిమ్స్ హాస్పిటల్‌ను త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రజలకు అంకితం చేయనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన శనివారం సమీక్షించారు. హాస్పిటల్‌లోని ఏ, బీ, సీ బ్లాకులను సందర్శించిన మంత్రి ఓపీ రిజిస్ట్రేషన్, ఇన్‌పేషెంట్ వార్డులు, ఎమర్జెన్సీ విభాగం, ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, సీటీ స్కాన్, ఎంఆరఐ, డయాగ్నస్టిక్స్, ల్యాబొరేటరీలు, బ్లడ్ బ్యాంక్, మెకనైజ్డ్ ల్యాండ్రీ, సెంట్రలైజ్డ్ కిచెన్, ఫార్మసీ తదితర విభాగాలను పరిశీలించారు. హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక వసతులు, వైద్య సేవల నిర్వహణ వ్యవస్థలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. హాస్పిటల్ ప్రారంభానికి ముందు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఓపీ కౌంటర్లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, హెల్ప్ డెస్క్‌లు, ఫార్మసీ సేవలు, వెయిటింగ్ ఏరియాలను మరింత పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. సీటీ స్కాన్, ఎంఆరఐ, డిజిటల్ ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ తదితర ఆధునిక యంత్రాలు పూర్తిస్థాయిలో రోగులకు అందుబాటులో ఉండేలా అవసరమైన డాక్టర్లు, టెక్నీషియన్లు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు ఈ హాస్పిటల్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. క్యాథ్‌ల్యాబ్‌లు, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సదుపాయాలు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా సనత్‌నగర్ టిమ్స్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలకు ప్రపంచస్థాయి వైద్య సేవలు అందించగల అత్యుత్తమ వైద్య సంస్థగా టిమ్స్ నిలవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. రోగులతోపాటు వారి సహాయకులకు కూడా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ధర్మశాల, క్యాంటీన్లు, పార్కింగ్ సదుపాయాలు, హాస్టల్ బ్లాకులు, ఇతర సహాయక సేవలను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ నిర్వహణ, వైద్య సేవలు, మానవ వనరులు, నాన్ మెడికల్ సర్వీసులు, భద్రత, పారిశుధ్యం తదితర అంశాలపై అవసరమైన సూచనలు చేశారు. సమావేశంలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఆర్ అండ్ బీ, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నీట్-2026కు పకడ్బందీ ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి

సిపిలు, ఇతర అధికారులతో కలిసి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్ 2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21న జరగనున్న నీట్ 2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు పరీక్షకు చేపట్టిన ఏర్పాట్లపై సమావేశాంలో వివరించారు. అదనపు పోలీస్ డైరెక్టర్ జనరల్ మహేష్ భగవత్ మాట్లాడుతూ, పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. జాతీయ పరీక్షా సంస్థ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ మాట్లాడుతూ, ఈ ఏడాది పరీక్షల కోసం మరింత కట్టుదిట్టమైన భద్రతా విధానాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా ప్రశ్నాపత్రాల రవాణా కోసం తొలిసారిగా భారత వైమానిక దళం సేవలను వినియోగిస్తున్నామన్నారు.

**వరి ధాన్యం కొనుగోలుపై సమీక్ష**

రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రాబోయే కొద్ది రోజుల పాటు కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. కోత పూర్తయిన ధాన్యాన్ని రక్షించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఇంకా ధాన్యం నిల్వ ఉన్న ప్రాంతాల్లో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి, ఇప్పటి వరకు 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేశామన్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చేపట్టనున్న పర్యటనల ఏర్పాట్లను కూడా ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేశామని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేస్తామన్నారు.



ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ సీవీ ఆనంద్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానా కిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, సీఈఓ దివ్య, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర గౌరవ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) శనివారం రాష్ట్రంలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

**అశ్వి అప్డేట్స్**

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యంగా CCTNS 2.0 (Crime and Criminal Tracking Network & Systems) పరిధిలో కేసుల దర్యాప్తు అప్‌డేషన్‌కు సంబంధించిన గడువులు, పెండింగ్ దర్యాప్తుల సకాలంలో పూర్తి, కేసు వివరాల ఆన్‌లైన్ నమోదు, డిజిటల్ రికార్డుల నిర్వహణ, SCRB (State Crime Records Bureau) నివేదికల సమర్పణ మరియు ఇతర సాంకేతిక ఆధారిత పోలీసింగ్ కార్యక్రమాలపై మీటింగ్ నిర్వహించడం జరిగింది.
అనంతరం జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ గారు జిల్లా లోని పోలీస్ అధికారులతో మాట్లాడుతూ, రాష్ట్ర డీజీపీ గారి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో CCTNS 2.0 వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. కేసుల దర్యాప్తు పురోగతిని నిర్దేశిత గడువుల్లో అప్‌డేట్ చేయడం, నాణ్యమైన డేటా ఎంట్రీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దర్యాప్తు ప్రక్రియను మరింత వేగవంతం చేయడం, SCRB నివేదికలను సకాలంలో సమర్పించడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
అలాగే, డిజిటల్ పోలీసింగ్ వ్యవస్థలను పూర్తి స్థాయిలో వినియోగించడం ద్వారా ప్రజలకు మరింత పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. ప్రతి పోలీసు అధికారి సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకుని, రాష్ట్ర పోలీసు శాఖ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఎస్పీ గారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి డిఎస్‌పి జానయ్య, డిటిసి డిఎస్‌పి శ్రీనివాస్, వికారాబాద్ డిఎస్‌పి అంజయ్య, తాండూర్ డిఎస్‌పి యాదయ్య, పరిగి డిఎస్‌పి శ్రీనివాస్ , ఏఆర్ డిఎస్‌పి వీరేష్, ఇతర అధికారులు జిల్లా పోలీసు కార్యాలయానికి చెందిన అధికారులు, విభాగాధిపతులు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## ప్రజా ప్రభుత్వం ప్రగతి ప్రణాళికలో భాగంగా అరోరా కాలేజీలో అవగాహన కార్యక్రమం

**అశ్వి అప్డేట్స్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న *"ప్రజా ప్రభుత్వం ప్రగతి ప్రణాళిక - 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక"*లో భాగంగా, యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ఈ రోజు భువనగిరిలోని అరోరా కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ బాబు, ఇన్‌స్పెక్టర్ తేజం రెడ్డి, కానిస్టేబుల్ శ్రీహరి మరియు మహిళా కానిస్టేబుల్ మమత పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రస్తుతం సమాజాన్ని ప్రభావితం చేస్తున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తత, వ్యక్తిగత సమాచారం రక్షణ, బలమైన పాస్‌వర్డ్‌ల వినియోగం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే మహిళల భద్రత, షీ టీమ్ సేవలు, మహిళల రక్షణ కోసం అందుబాటులో ఉన్న చట్టపరమైన సదుపాయాలు గురించి వివరించారు. అదే విధంగా యువతలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాలు గురించి తెలియజేస్తూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత గురించి కూడా వివరించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగగలరని, ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత మరియు మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళల భద్రత, బాలల రక్షణపై అవగాహన కార్యక్రమం

**యాదాద్రి భువనగిరి, అశ్వి అప్డేట్స్**



యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ అక్షాన్ష్ యాదవ్, IPS గారి ఆదేశాల మేరకు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ అర్జునయ్య గారి ఆధ్వర్యంలో మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, షీ టీమ్, భరోసా సెంటర్, CDEW సిబ్బంది సంయుక్తంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భువనగిరి పట్టణంలోని రావి భద్రారెడ్డి ఫంక్షన్ హాల్ (భరోసా సెంటర్ ఎదురుగా) అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, షీ టీమ్ సిబ్బంది, భరోసా సెంటర్ సిబ్బంది, మహిళా మండలి సభ్యులు మరియు అరోరా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మరియు మహిళలకు మహిళల భద్రత, బాలల రక్షణకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా లింగ సమానత్వం, బాలల భద్రత, పితృస్వామ్య భావజాలం, మహిళల పట్ల వివక్ష, లింగ వివక్ష లింగ పక్షపాతం, మహిళలు మరియు పిల్లలపై జరిగే వివిధ రకాల హింస గురించి వివరించారు. అలాగే షీ టీమ్ మరియు మహిళా పోలీస్ స్టేషన్ విధులు, వాటి సేవలు, మహిళలకు అందించే సహాయం, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, సైబర్ బుల్లీయింగ్, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా (Human Trafficking), బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, ఉద్యోగ ప్రదేశాల్లో వేధింపులు, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నిబంధనలు మరియు TSafe యాప్ వినియోగం గురించి సమగ్రంగా వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 / 112, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 నంబర్లకు ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. మహిళలు, బాలికలు మరియు విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా షీ టీమ్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. సమాజంలో మహిళలు, పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా నేరాలను నివారించవచ్చని తెలిపారు.

# గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్ళవద్దు. జిల్లా ఎస్పీ: డాక్టర్.వినీత్

- **మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీములతో ప్రజలు అప్రమత్తంగా వుండాలి**

**ఆశ్వి అప్డేట్: నారాయణపేట జూన్ 6**

ప్రజల సొమ్ము దోచుకోనేందుకు సైబర్ నేరగాళ్ళు రోజు,రోజుకి కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగాచేసుకోనేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారు. మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్. ప్రజలకు ఒక ప్రకటనలో తెలిపారు. గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టిలెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయి, మీ క్రింద ఎక్కువ మంది ఎజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దు అని ఎస్పీ అన్నారు. ఇలాంటి మల్టీలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్దికంగా మోసం చేస్తూ చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎక్కువమంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపుతారు. ఇలాంటి వారి మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుంది అన్నారు. సైబర్ మోసగాళ్ళు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ మోసగాళ్లు మల్టీ లెవెల్ మార్కెటింగ్ పై దృష్టి సారించి గొలుసు కట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రామ్,



ఫేస్బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్షించి మోసగించి ఆర్థిక నష్టాన్ని కలగజేస్తారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ ను చాలామంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్ లా నడుపుతారు భారీ లాభాలు తోపాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయకులకు వలపన్నుతారని ఎలాంటి మాయ మాటలు నమ్మరాదు అని ఎస్పీ తెలిపారు. అతి తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెప్తే అది మోసమని గ్రహించాలి, లేదంటే ప్రజల్ని మాయలోకి దింపి డబ్బులు కొల్లగొడతారు, అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. గొలుసుకట్టు మార్కెటింగ్ లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయి ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. ఇలాంటి నెట్వర్క్ లో ఎవరు చేరొద్దు ఆయా సంస్థల నిర్వాహకులు, కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు ఎవరు వెళ్ళవద్దు. సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి, అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకె ఫైల్స్ లాంటివి డౌన్లోడ్ చేయవద్దు. మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయండి అని ఎస్పీ తెలిపారు.

# నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా 'బాల పంచాయతీ' కార్యక్రమం..

- **పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సమస్యల పరిష్కార నైపుణ్యాల పెంపుదలే లక్ష్యం..**

**ఆశ్వి అప్డేట్స్ తెలంగాణ క్రైమ్ బ్యూరో జూన్ 06:**

నల్లగొండ జిల్లా కనగల్ మండలం చెర్లగౌరారం గ్రామంలో జిల్లా పోలీస్ శాఖ, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆదేశానుసారం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (AHTU) బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాల పంచాయతీ' కార్యక్రమం ఘనంగా జరిగింది. పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, విమర్శనాత్మక ఆలోచన, సామాజిక బాధ్యత, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిష్త్ ఐపీఎస్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామస్థాయి నుంచి పిల్లలకు ప్రజాస్వామ్య అవగాహన కల్పించడం, వారి అభిప్రాయాలను వినడం, గ్రామాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గ్రామంలో ఉన్న పలు సమస్యలపై తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తపరిచారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, బాలల భద్రత, విద్యా ప్రమాణాలు, గ్రామాభివృద్ధి వంటి అంశాలపై బాలలు చర్చించారు. బాలలతో నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్లు, అవగాహన కార్యక్రమాలు, ప్రశ్నోత్తర సమావేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా అభిలాషా బిష్త్ ఐపీఎస్ మాట్లాడుతూ పిల్లల హక్కులు, వారి భవిష్యత్ నిర్మాణం సమాజానికి అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లల రక్షణ కుటుంబం నుంచే ప్రారంభమవుతుందని, ప్రతి తల్లి తండ్రి పిల్లలకు సమయం కేటాయిస్తూ వారి ఆలోచనలను ప్రోత్సహించాలని సూచించారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన దిశలో మార్గనిర్దేశం చేస్తే భవిష్యత్తులో సమాజానికి



ఉపయోగపడే నాయకులుగా ఎదుగుతారని తెలిపారు. సమాజంలో మార్పు రావాలంటే ముందుగా ప్రతి ఒక్కరూ తమలో మార్పు తీసుకురావాలని సూచించారు. అలాగే చిన్నారులు తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తపరచాలని, సమాజంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "పిల్లలే మన భవిష్యత్తు. వారికి సమయం ఇవ్వండి, వారి ఆలోచనలను వినండి, ప్రోత్సహించండి" అని ఆమె పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచే పిల్లలకు నాయకత్వ అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురాగలమన్నారు. విద్యతో పాటు పిల్లల్లో సామాజిక అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని తెలిపారు. బాలలు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ బాలల భద్రత, విద్య, మానసిక అభివృద్ధి కోసం జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రతి గ్రామంలో బాలల సమస్యలు,రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యంగిస్థాన్ ఎన్జీఓ, ఆశ్రిత ఎన్జీఓ ప్రతినిధులు పాల్గొని బాలల హక్కులు, విద్య ప్రాముఖ్యత, సురక్షిత బాల్యం, మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.చివరగా స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో బాలల సాధికారత, సంక్షేమం కోసం అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి,ఎంపిడిఓ వేద రక్షిత,సీఐలు ఆది రెడ్డి, రాము, కరుణాకర్,ఎస్.ఐ అంజలి, రాజీవ్ రెడ్డి,డీడబ్ల్యూఓ కృష్ణవేణి, డీఈఓ సుశీందర్ రావు, సీడబ్ల్యూసీ చైర్మన్ కృష్ణయ్య, చెర్లగౌరారం సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, యువత, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు 300 మందికి పైగా గ్రామస్తులు పాల్గొన్నారు.

# అక్రమ రవాణాకు అధికారుల 'ఉచిత సలహా'

- **సెలవు దినాలు, రాత్రి వేళల్లో మట్టి తరలింపునకు అధికారుల సూచనలు**
- **ఫోన్ చేస్తే రామని మాఫియాకు భరోసా**
- **పర్మిషన్ ఫీజు తప్పించుకునేందుకు ముడుపుల వ్యవహారం**
- **రెవెన్యూ, పోలీస్ శాఖలతో ఒప్పందాలకు తెర**
- **ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి**

**ఆశ్వి అప్డేట్స్, దుబ్బాక**

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలో అక్రమ మట్టి రవాణా జోరుగా సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు స్థానిక అధికారుల అండదండలతోనే ఈ దందా కొనసాగుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా సెలవు దినాలు, రాత్రి వేళల్లో మట్టి తరలింపునకు అధికారుల నుంచే పరోక్షంగా గ్రీన్ సిగ్నల్ లభిస్తోందన్న ప్రచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ అనుమతులతో మట్టి తరలించాలంటే నిర్ణీత రుసుములు చెల్లించాల్సి ఉండగా, కొందరు నిర్వాహకులు అక్రమ మార్గాలను ఆశ్రయిస్తున్నట్లు సమాచారం. స్థానికుల కథనం ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత లేదా సెలవు దినాల్లో మట్టి తరలిస్తే తనిఖీలు ఉండవని, ఫోన్ చేసినా అధికారులు స్పందించరని మట్టి మాఫియాకు భరోసా ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు.

**అధికారులకు 'మామూళ్లు'..?**

పర్మిషన్లు లేకుండానే మట్టి తరలింపునకు కొందరు అధికారులకు ముందుగానే ముడుపులు చెల్లిస్తే సరిపోతుందనే ధీమాతో



మాఫియా వ్యవహరిస్తోందని స్థానిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. దళారుల ద్వారా రెవెన్యూ, పోలీస్ శాఖలతో ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకుని రాత్రి వేళల్లో దందాను నిరాటంకంగా కొనసాగిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.చెరువులు, కుంటలు, వ్యవసాయ భూముల పరిసర ప్రాంతాల నుంచి మట్టిని అక్రమంగా తరలించడం వల్ల సహజ వనరులు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూముల సారవంతతకు కూడా ముప్పు వాటిల్లుతోందని పేర్కొంటున్నారు.
మిరుదొడ్డి మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి రవాణాపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించే ఇటువంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" గ్రామ సభల కార్యక్రమం

**ఆశ్వి అప్డేట్స్ తెలంగాణ క్రైమ్ బ్యూరో జూన్ 06:**

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" గ్రామ సభల కార్యక్రమంలో భాగంగా, ప్రజల రక్షణ కోసం సమాజ భాగస్వామ్యంతో పనిచేయాలనే లక్ష్యంతో మహిళలు మరియు పిల్లల రక్షణార్థం వికారాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా "సురక్ష మిత్ర" అనే వినూత్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌కే కన్వెన్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పరిగి శాసనసభ్యులు శ్రీ రామ్ మోహన్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరుకాగా, జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారీ మరియు జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా గారు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. వేదికపై ఉన్న ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు, ఈ వినూత్న కార్యక్రమానికి సంబంధించిన అధికారిక "సురక్ష మిత్ర" లోగోను ప్రముఖులు ఘనంగా ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ముఖ్య అతిథులు పరిగి శాసన సభ్యులు శ్రీ రామ్ మోహన్ రెడ్డి గారు మాట్లాడుతూ, మహిళలు మరియు చిన్నారుల భద్రతను మరింత పటిష్టం చేయడానికి పోలీసు శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ మరియు మారుమూల ప్రాంతాలు అధికంగా ఉన్న వికారాబాద్ జిల్లాలో కేవలం పోలీసుల నిఘా మాత్రమే కాకుండా ప్రజల సహకారం కూడా లభిస్తే నేరాల నియంత్రణలో విశేష ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. సమాజంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువజన ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, బాధ్యతగల పౌరులను 'సురక్ష మిత్ర' వాలంటీర్లుగా ఎంపిక చేసి పోలీసులకు సహకరించే విధంగా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. పోలీసులకు, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ మహిళల భద్రత, బాలల రక్షణ, బాల్య వివాహాల నిరోధం, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం, మహిళలపై వేధింపులను అరికట్టడం వంటి అంశాలలో కీలక పాత్ర పోషించాలని తెలిపినారు..
జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారీ గారు మాట్లాడుతూ, మహిళలు మరియు బాలల భద్రతను పటిష్టం చేయడంలో "సురక్ష మిత్ర" కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రజల క్రియాశీలక భాగస్వామ్యం ఉన్నప్పుడే ఆశించిన మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు, భద్రతా వ్యవస్థలను మరింత చేరువ చేయడంలో ఈ వాలంటీర్ల వ్యవస్థ ఎంతో దోహదపడుతుందని తెలిపారు.జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ గారు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామం, ప్రతి వార్డులో సురక్ష మిత్రలను ఏర్పాటు చేసి ప్రజా భాగస్వామ్యంతో కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గ్రామ సభలు, అవగాహన కార్యక్రమాలు, పాఠశాలలు, కళాశాలలు మరియు ప్రజా సమావేశాల ద్వారా మహిళల భద్రత, బాల్య వివాహాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల



నిర్మూలన, అనుమానాస్పద కార్యకలాపాల సమాచారాన్ని పోలీసులకు చేరవేయడం వంటి అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అలాగే ప్రతి గ్రామం మరియు వార్డు స్థాయిలో ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి ప్రజల సమస్యలపై తక్షణ స్పందన అందించేలా సమర్థవంతమైన సమాచార వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. "సురక్ష మిత్ర" లోగోలోని చేతులు సమాజ బాధ్యతను, షీల్డ్ రక్షణను, తల్లిబిడ్డల ప్రతిరూపం మహిళలు మరియు చిన్నారుల సంక్షేమాన్ని, తరంగాలు అప్రమత్తతను సూచిస్తాయని వివరించారు. 'సురక్ష మిత్ర' వాలంటీర్లు ఉన్న వారికి శిక్షణ కార్యక్రమం కూడా ఏర్పాటు చెయ్యడం జరుగుతుంది మరియు ఈ కార్యక్రమంలో ఉత్తమంగా పనిచేసే సురక్ష మిత్ర వాలంటీర్లను జిల్లా స్థాయిలో ప్రత్యేక అవార్డులు, ప్రశంసా పత్రాలతో సత్కరిస్తామని ఎస్పీ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రజిత వెంకటేష్, డి.పి.ఓ జయసుధ, పరిగి మున్సిపల్ వైస్ చైర్మన్ కమల్ నాయక్, ఏఎంసీ చైర్మన్ పరశురామ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె. మల్లేష్, ఎస్.డి.పి.ఓ శ్రీనివాస్, ఎంపీడీఓ హరిప్రియ రెడ్డి, ఎమ్మార్వో వెంకటేశ్వరి, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, స్వచ్ఛంద కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.





# అంతర్జాతీయ స్థాయిలో సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తాం

**అశ్వ అప్డేట్స్ అసోసియేట్ ఎడిటర్ హైదరాబాద్ జూన్ 06 :**

ఓఆర్ఆర్ లోపలి ప్రాంతంలో 1.34 కోట్ల జనాభాతో వేగంగా విస్తరించిన నేపథ్యంలో ఈ ప్రాంత అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయిలో సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు చెప్పారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్, కోహెడలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌ను ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు , దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పండ్ల మార్కెట్‌తో పాటు సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు.

రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలకు ఏం కావాలన్నా ఇక్కడికి వస్తే అన్నీ అందుబాటులో ఉండే విధంగా 240 ఎకరాల్లో రూ. 2,300 కోట్లతో అత్యాధునిక వసతులతో మార్కెట్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత ఈ మార్కెట్‌కు అంతర్జాతీయ గుర్తింపు వస్తుంది" అని విశ్వాసం వ్యక్తం చేశారు.

30, 40 ఏండ్ల కిందట పండ్లు, కూరగాయల పంటల సాగుతో రంగారెడ్డి జిల్లా కళకళలాడిందని గుర్తుచేశారు. రంగారెడ్డి జిల్లా రైతులు కష్టపడి హైదరాబాద్ ప్రజలకు పండ్లు, కూరగాయలు, పాలు సరఫరా చేసేవారని, రియల్ ఎస్టేట్ విస్తరణతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పారు.

ఈ ప్రాంత ప్రజలు ఏది కొనాలన్నా పక్క రాష్ట్రం నుంచి దిగుమతి చేసుకోవలసిన పరిస్థితులు వస్తున్నాయని అన్నారు. రైతులు వరి, మొక్క జొన్న, జొన్న, పత్తి వంటి కేవలం నాలుగైదు పంటలను మాత్రమే పండించడం వల్ల ప్రజలపై విపరీతమైన ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటున్నాయని, అందుకు ప్రత్యామ్నాయంగా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా ప్రత్యామ్నాయ పంటలను పండించాలని కోరారు.

స్థానిక ప్రజల సహకారంతో ప్రభుత్వం ధైర్యంగా ఈ పండ్ల మార్కెట్‌ను ప్రారంభించింది. వచ్చే రెండేళ్లలో దీన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తాం. ఈ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి నిధుల కొరత లేకుండా గ్రీన్ చానెల్‌లో విడుదల చేస్తాం. వచ్చే డిసెంబర్‌లో పనులు ప్రారంభించే విధంగా శ్రమించాలి అని మంత్రులకు సూచించారు.

భారత్ ఫ్యూచర్ సిటీలో కాలుష్య కారక పరిశ్రమలు తెస్తామంటే, ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటాయని, అందుకే ఆ ప్రాంతంలో ఒక మహానగరాన్ని నిర్మించి ప్రపంచంలోనే గుర్తింపు పొందిన ఫార్చ్యూన్ 500 కంపెనీలను తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు.

"రిజిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వానికి ఏటా 15 నుంచి 16 వేల కోట్ల ఆదాయం సమకూర్చుతున్నప్పటికీ ఎవరైనా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళితే కూర్చోవడానికి కనీసం కుర్చీ కూడా ఉండదు. ఇలాంటి దుస్థితి ఉండకూడదన్న ఉద్దేశంతోనే అత్యాధునిక వసతులతో ఈ పక్కనే సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి కూడా శంకుస్థాపన చేశాం" అని ముఖ్యమంత్రి గారు చెప్పారు. హైదరాబాద్ నగరంలో 39 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉంటే వాటిని 12 క్లస్టర్లుగా అత్యంత అధునాతన సదుపాయాలతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించుకుంటున్నామని తెలిపారు. అంతర్జాతీయ నగరమని మనకు మనం గొప్పలు చెప్పుకుంటే సరిపోదు. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసుకున్నప్పుడే ఆ గుర్తింపు వస్తుంది. అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల నిర్మాణం, మెట్రో విస్తరణ వంటి పనులను పూర్తి చేస్తాం" అని స్పష్టం చేశారు. కోహెడ పండ్ల మార్కెట్ నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి జరిగిందంటే రాష్ట్రంలో అభివృద్ధి జరిగినట్టేనని, రైతును రాజును చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు.

## రహదారుల అభివృద్ధికై సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం

**అశ్వ అప్డేట్స్ తెలంగాణ బ్యూరో జూన్ 06 :**



ఎల్బీనగర్ నియోజకవర్గంలో పలు రహదారుల అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రాలు అందజేసిన టీజీఆర్డీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి కోహెడలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారిని తెలంగాణ రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ (టీజీఆర్డీసీ) చైర్మన్ శ్రీ మల్‌రెడ్డి రాంరెడ్డి గారు కలిసి, ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు కీలక రహదారుల విస్తరణ, బలోపేతం మరియు అభివృద్ధికి సంబంధించి వినతిపత్రాలు అందజేశారు.వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎల్బీనగర్ నియోజకవర్గంలో పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ప్రజలకు మెరుగైన రోడ్డు సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదనలు సమర్పించినట్లు మల్‌రెడ్డి రాంరెడ్డి తెలిపారు.

ప్రధానంగా మన్సూరాబాద్‌లోని కేబీఆర్ ఫంక్షన్ హాల్ నుండి కుంట్లూర్ ఎక్స్ రోడ్ వరకు, బండ్లగూడ-తట్టిఅన్నారం-గౌరెల్లి-బాచారం మార్గంలో ఇన్నర్ రింగ్ రోడ్ నుండి ఔటర్ రింగ్ రోడ్ వరకు, వనస్థలిపురం సుష్మా థియేటర్ నుండి ఇంజాపూర్ వరకు, బీఎన్ రెడ్డి చౌరస్తా నుండి టీకేఆర్ కమాన్ వరకు, సాగర్ రోడ్ నుండి ఆర్సీఐ రోడ్ వరకు, ఎల్బీనగర్ మరియు మన్సూరాబాద్ పరిసర ప్రాంతాల్లోని అనేక కీలక రహదారుల విస్తరణ మరియు బలోపేతానికి సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి అందజేశారు. అదేవిధంగా సుష్మా థియేటర్ నుండి ఎంఈ రెడ్డి గార్డెన్స్, మన్సూరాబాద్ మీదుగా ఎల్బీనగర్ ఇండోర్ స్టేడియం వరకు, ఆనంద్‌నగర్ చౌరస్తా నుండి మన్సూరాబాద్ చౌరస్తా వరకు, ఎల్బీనగర్ చౌరస్తా నుండి సరూర్‌నగర్ చెరువు, గంగా థియేటర్ మీదుగా టీవీ టవర్ వద్ద ఉన్న కోనార్క్ డయాగ్నస్టిక్ సెంటర్ వరకు రహదారి విస్తరణ మరియు ప్రధాన రహదారుల అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రాలను పరిశీలించిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖల అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మల్‌రెడ్డి రాంరెడ్డి తెలిపారు. రహదారుల అభివృద్ధి ద్వారా ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## పత్రికా విలేకర్ల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు సమన్వయ సమావేశం

**అశ్వ అప్డేట్స్**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పత్రికా విలేకర్ల క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన జట్ల ఫిక్చర్స్, మ్యాచ్ షెడ్యూల్ ఖరారు కార్యక్రమం ఈ రోజు సైబరాబాద్ సీపీ కార్యాలయంలోని మినీ హాల్‌లో జరిగింది. సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి వివిధ ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు చెందిన రిపోర్టర్లు, జట్ల కెప్టెన్లు మరియు ప్రతినిధులు హాజరయ్యారు. పత్రికా విలేకర్ల లో క్రీడా స్ఫూర్తి, పరస్పర స్నేహభావం మరియు ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే 10 జట్లకు సంబంధించిన డ్రా నిర్వహించి మ్యాచ్‌ల ఫిక్చర్స్‌ను ఖరారు చేశారు. పోటీలను నాకౌట్ విధానంలో నిర్వహించనున్న నేపథ్యంలో జట్లకు బైలు కూడా నిర్ణయించారు. ఈ సందర్భంగా జట్ల కూర్పు, ఆటగాళ్ల జాబితా, జెర్సీ మరియు లోయర్ సైజులు, డ్రెస్ కలర్స్, మ్యాచ్‌ల నిర్వహణ సమయాలు, గ్రౌండ్ ఏర్పాట్లు, అంపైరింగ్ తదితర అంశాలపై చర్చించారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు మీడియా ప్రతినిధుల నుంచి పలు సూచనలు స్వీకరించారు. ఈ సమావేశంలో మ్యాచ్‌ల కోసం ఉపయోగించే బాల్, జట్ల డ్రెస్ కలర్స్, పోటీల నిర్వహణకు సంబంధించిన ఇతర అంశాలపై కూడా చర్చించారు. మీడియా ప్రతినిధులు మరియు పోలీసు శాఖ మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు రిపోర్టర్లలో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించే వేదికగా ఈ క్రికెట్ టోర్నమెంట్ నిలవనుందని డీసీపీ సంజీవ్ తెలిపారు.

## నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (NAC)కు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక గుర్తింపు

**అశ్వ అప్డేట్స్**



నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (NAC)కు "నిర్మాణ రంగంలో ఉత్తమ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం" విభాగంలో ప్రతిష్ఠాత్మక ప్లాటినం అవార్డు లభించిన సందర్భంగా, అలాగే NAC డైరెక్టర్ జనరల్, CE (R&B) QC శ్రీ ఎం. శ్రీనివాస రెడ్డి గారికి *ISDA ఇన్‌ఫ్రాకాన్ నేషనల్ అవార్డ్స్ (IINA2026)*లో ప్రభుత్వం సేవలో R&B విభాగంలో అత్యుత్తమ ప్రదర్శనకు గోల్డ్ అవార్డు దక్కిన సందర్భంగా, రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ విజయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు NAC బృందాన్ని మరియు శ్రీ ఎం. శ్రీనివాస రెడ్డి గారిని అభినందిస్తూ, నిర్మాణ రంగంలో నైపుణ్యాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన, నాణ్యమైన శిక్షణ కార్యక్రమాల అమలులో NAC చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించడంలో NAC కీలక పాత్ర పోషిస్తోందని, 202526 సంవత్సరంలో 21,016 మందికి వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విజయమని మంత్రి అన్నారు. భవిష్యత్తులో కూడా రాష్ట్ర యువతకు మరింత మెరుగైన శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా NAC ముందుకు సాగాలని ఆకాంక్షించారు. న్యూఢిల్లీలో జూన్ 5న ప్రదానం చేసిన ఈ అవార్డులు తెలంగాణ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి రంగానికి దక్కిన గౌరవంగా మంత్రి పేర్కొన్నారు.

## కోహెడ ఫ్రూట్ మార్కెట్ లో భూములను కోల్పోతున్న రైతులకు అండగా శ్రీరాములు అందెల

**రంగారెడ్డి, అశ్వ అప్డేట్స్**



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కోహెడ ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా రైతులు సాగు చేస్తున్నటువంటి భూములను ఎలాంటి నష్ట పారిహారం ఇవ్వకుండా రైతుల నుండి దౌర్జన్యంగా స్వాధీనం చేసుకొని నేడు ఆ భూములలో కోహెడ ఫ్రూట్ మార్కెట్ కొరకు శంకుస్థాపనకు విచ్చేస్తున్నటువంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి భూ బాధిత రైతులు మరియు భారతీయ జనతా పార్టీ నాయకులు ఎక్కడ నిరసన వ్యక్తం చేస్తారో అని ఈరోజు ఉదయాన్నే రైతులను, భారతీయ జనతా పార్టీ నాయకులను, బిఆర్ఎస్ పార్టీ నాయకులను, అలాగే సొంత పార్టీ కాంగ్రెస్ ఎక్స్ కౌన్సిలర్లను సైతం ముందస్తు అరెస్టు చేసి నాగోల్ మరియు హయత్ నగర్ పోలీస్ స్టేషన్ కు తరలించిన నేపథ్యంలో వారికి మద్దతు తెలిపేందుకు మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు నాగోల్ పోలీస్ స్టేషన్ కు చేరుకుని భూ బాధిత రైతులను, బిజెపి అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహా రెడ్డి గారిని మరియు వివిధ పార్టీ నాయకులను పరామర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ నాడు కెసిఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు సంకెళ్లు వేయడం చూసామని నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కూడా అదే పరిస్థితులు కొనసాగడం దురదృష్టకరమని... రైతుల భూములు తీసుకుంటే వారికి న్యాయమైన నష్టపరిహారం, ఉపాధి భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. కోహెడ ఫ్రూట్ మార్కెట్ అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదు...కానీ రైతుల ప్రయోజనాలను పక్కనబెట్టి అభివృద్ధి పేరుతో వారి హక్కులను హరించడం సమంజసం కాదన్నారు....బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు, వారి సమస్యలకు పరిష్కారం లభించే వరకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. రైతులతో ప్రభుత్వం చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



## జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలి

- **సీనియర్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు**
- **పులిపలుపుల ఆనందం**
- **నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, రత్నచోటి రాణి**
- **రాష్ట్ర బిజేపి అధ్యక్షులు రామచందర్ రావుకు వినతి పత్రం అందజేత.**

**హైదరాబాద్, అశ్వ అప్డేట్స్ :**

రాష్ట్రాల, కేంద్ర పాలిత జర్నలిస్టులకు జాతీయ స్థాయిలో పెన్షన్ పథకం అమలు చేయాలని సీనియర్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు కు వినతి పత్రం అందచేశారు.

ఈ సందర్భంగా ఆనందం మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాలు మాత్రమేజర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేస్తున్నారని, జాతీయ స్థాయిలో ఈవిధానం అమలుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టేందుకు మీరు సిఫారసు చేయాలని వారిని కోరారు. సీనియర్ పాత్రికేయులకు, జాతీయ వెల్ఫేర్ ఫండ్, పెన్షన్, మీడియా కమిషన్ జాతీయ స్థాయిలో రిటైర్ సీనియర్ జడ్జితో ఏర్పాటు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు జాతీయ భద్రత కల్పించాలని వారు విన్నవించారు. ఈకార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, రత్న చోటి రాణి పాల్గొన్నారు.



**అశ్వ అప్డేట్స్ జూన్ 6 :**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కోహెడ ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా అరెస్ట్ చేసి నాగోల్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన బీఆర్ఎస్ నాయకులు, రైతులను పరామర్శించిన బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు "మంచిరెడ్డి కిషన్ రెడ్డి". వెంటనే వారిని విడుదల చేసి ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల గొంతుకను అణచివేయడం ప్రజాపాలన కాదని, ఇది "ప్రజా నిర్బంధ పాలన"కు నిదర్శనమని ఆయన విమర్శించారు.

# పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

- **జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.**

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 6**



ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలనీ, వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వాతావరణ సమతుల్యత ను కాపాడాలని కలెక్టర్ తెలిపారు. శనివారం మరికల్ మండలంలోని పెద్ద చింతకుంట గ్రామ సచివాలయం ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లో భాగంగా ఇంతవరకు తడి,పొడి చెత్త నిర్వహణ మాత్రమే చేశారని, ఇప్పుడు సుప్రీం కోర్టు గైడ్ లెన్స్ ప్రకారం తడి, పొడి చెత్తతో పాటు శానిటరీ, మెడికల్ వెస్ట్ చెత్తతో నాలుగు రకాలుగా సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. చెత్త సేకరణ విషయంలో గ్రామ సర్పంచి, కార్యదర్శి ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇండ్లలో పోగయ్యే చెత్తను నాలుగు రకాలుగా నిల్వ చేసేలా గ్రామస్థులకు తెలియజేయాలని చెప్పారు. అలాగే ఉపాధి హామీ పథకం లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రతీ రోజు మురుగు కాల్వలను శుభ్రం చేయించాలని కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు గ్రామస్థులకు ఎస్. ఐ ఆర్ పట్ల సంపూర్ణ అవగాహన అవసరమని అభిప్రాయ పడ్డారు. బీ ఎల్ వో లు కొత్త ఓటర్ల ను నమోదు చేస్తారని, గతంలో గ్రామాల్లో నివాసం ఉండి, ఇప్పుడు వేరే ఊర్లకు వెళ్లిన వారు, చనిపోయిన ఓటర్ల ను తొలగించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 25 నుంచి మొదవుతుందని చెప్పారు. ఇండ్ల వద్దకు బి ఎల్ వో లు వచ్చి రెండు ఫారాలు ఇస్తారని, వాటిలో మన పూర్తి వివరాలను రాసి, సరైన ధృవ పత్రాలను జత చేసి బీ ఎల్ వోలకు తిరిగి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆ తర్వాత ఈ ఆర్ వో స్థాయిలో కొత్త ఓటరు జాబితాలను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయ వద్ద ప్రచురిస్తారని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలియ చేయాలని కలెక్టర్ సూచించారు. 2002 లో ఉన్న మన ఓటరు సంఖ్య ను అనుసంధానం చేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం పెద్ద చింతకుంట గ్రామంలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ 80 శాతం పూర్తి అయిందని, పెండింగ్ లో ఉన్న మిగతా 20 శాతం కూడా వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను కూడా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం రాబోతోందని, అప్రమత్తంగా ఉండాలని, రోజు మురుగు కాల్వల ను శుభ్రం చేయించాలని, డెంగీ, మలేరియా ప్రబల కుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తిరుపతమ్మ, జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, డిఆర్డిఓ వెంకట్ రాములు, డిపివో సుధాకర్ రెడ్డి, తహసిల్దార్ రామ్ కోటి, ఎంపీడీవో పృథ్వీరాజ్, ఎంపీఓ పావని, గ్రామ కార్యదర్శి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## భీమలింగం ను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సందర్శన

**యాదాద్రి భువనగిరి, అశ్వ అప్డేట్స్**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామ సమీపంలోని భీమలింగం ను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సందర్శించారు. భీమలింగేశ్వ ర స్వామి దేవాలయం నిర్మాణం కోసం ఇప్పటికే 2 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని, దేవాలయం నిర్మాణం, సమీపంలో బ్రిడ్జి నిర్మాణం 45 కోట్లు ఆ ప్రాంతం అభివృద్ధి చేసుకోవటానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా సహకరిస్తా అని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వెల్లడించారు. భీమలింగేశ్వర స్వామి ఆలయం నిర్మాణం కోసం అధికారులు ప్రణాళికాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మూసి ప్రక్షాళన చేసి , ఆలయ నిర్మాణం కూడా పూర్తి చేస్తామని, అన్నారు. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక కేంద్రం గా తీర్చి దిద్దుతామని అంతకు మునుపు స్థానిక నాయకులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు. భీమలింగం కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టూ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో R&B, ఇరిగేషన్, రెవెన్యూ, అధికారులు,ఆర్కిటెక్ట్ మరియు ఇతర సిబ్బంది, మండల నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు..





ముఖేష్ అంబానీ పెట్టుబడి పెట్టిన భారీ ఆయిల్ రిఫైనరీ పోర్ట్ ఆఫ్ బ్రౌన్స్‌విల్లేలో, మెక్సికో సరిహద్దు సమీపంలోని టెక్సాస్ దక్షిణ కొనపై ఉంది. America First Refining (AFR) అనే స్టార్టప్ కంపెనీ ఈ రిఫైనరీని నిర్మిస్తోంది.

గత 50 ఏళ్లలోనే అమెరికా గడ్డపై నిర్మిస్తున్న మొట్ట మొదటి భారీ, ప్రపంచ స్థాయి ఆయిల్ రిఫైనరీగా ఇది పేరుపొందింది. అంతే కాదు ప్రపంచంలోనే అతి పెద్దది. చారిత్రాత్మక $300 బిలియన్ల పెట్టుబడితో రిలయెన్స్ ఈ వార్తతో ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. 20 సంవత్సరాల వాణిజ్యపరమైన బైండింగ్ ఒప్పందాన్ని (commercial binding agreement) రిలయెన్స్ కుదుర్చుకుంది.

**ట్రంప్ కు ఇందులో అనధికారిక భాగస్వామ్యం ఉంది అనేది బహిరంగ రహస్యం.**

ఈ రిఫైనరీలో ట్రంప్ తన వ్యక్తిగత నిధులను పెట్టుబడిగా పెట్టనప్పటికీ, వాచ్‌డాగ్ గ్రూపులు (నిఘా సంస్థలు), ఆర్థిక బహిర్గత పత్రాల ఆధారంగా ఈ రెండు సంస్థల మధ్య ఉన్న ఒక భిన్నమైన ఆర్థిక సంబంధాన్ని గుర్తించాయి.

2024లో, ట్రంప్ తన రెండవ విడత అధ్యక్ష పదవిని చేపట్టడానికి ముందు, రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఒక విభాగం (రిలయన్స్ 4IR రియల్టీ డెవలప్‌మెంట్), ముంబైలో ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ లైసెన్సింగ్ ఒప్పందం కోసం ట్రంప్ ఆర్గనైజేషన్‌కు $10 మిలియన్ల (10 మిలియన్ డాలర్ల) డెవలప్‌మెంట్ /లైసెన్సింగ్ ఫీజును చెల్లించింది. రిలయన్స్ సంస్థ రెండు దశాబ్దాల పాటు 1.2 బిలియన్ బారెళ్ల అమెరికన్ లైట్ షేల్ ఆయిల్ (light shale oil) ను, దాని శుద్ధి చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ఎవరికీ సాధ్యం కాని, అతి ఖరీదైన చారిత్రాత్మక భారీ ఒప్పందం చేసుకుంది.

అందుచేత మనకి అర్థమయ్యేది ఏమిటంటే మన దేశం మరొక 20 ఏళ్ళ పాటు ఖరీదైన అమెరికన్ ఆయిల్ నే కొనబోతోంది. చవక రష్యన్, ఇరానియన్ ఆయిల్ ను ఉపయోగించే ప్రాప్తం మనకు లేదు. ఈ ఒప్పందం ప్రకారం రిలయన్స్ సంస్థ సదరు రిఫైనరీ ఉత్పత్తి చేసే ఇంధనాలను (గ్యాసోలిన్, డీజిల్, జెట్ ఇంధనం) కొనుగోలు చేసి పంపిణీ చేస్తుంది, అలాగే నిరంతరం అమెరికన్ షేల్ (shale) ఆయిల్ ను కొనుకోలు చేస్తామన్న భరోసాను ఇస్తుంది, భారతీయ ధనాన్ని నిరంతరం అమెరికా ఆర్థిక వ్యవస్థలోకి చొప్పించడం ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చెయ్యడానికి, అక్కడి ద్రవ్యలోటును తగ్గించడానికి ఈ ప్రాజెక్ట్ సాయపడుతుంది. రూపాయి విలువ మరింతగా పడిపోవడానికి మన సంపదను తరలించివేసే ఇటువంటి విదేశీ ప్రాజెక్టుల్లో భారతీయ కంపెనీలు పెట్టే భారీ పెట్టుబడులు ప్రధాన కారణంగా ఉన్నాయి.

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

- **గత ప్రభుత్వ హాయంలో ఎక్కడ కూడా పేదవారికి ఇల్లు నిర్మించి ఇవ్వలేదు**
- **కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదోడి సొంతింటి కల నెరవేరుతుంది ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్**



**చిన్న శంకరంపేట జూన్ 6**
**ఆశ్వి అప్డేట్స్...**

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని మొత్తం అప్పులపాలు చేసిందని ఒక్కవ్యక్తి పై రెండు నుంచి మూడు లక్షల రూపాయల అప్పు ఎత్తడం జరిగిందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ అన్నారు, చిన్న శంకరంపేట మండలంలోని రాదే శ్యామ్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు, అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 108 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్, చెక్కులను అందజేశారు, చిన్న శంకరంపేట మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ చంద్రశేఖర్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ను కోరారు, చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ తో పాటు నాయకులు శాలువాతో సన్మానించారు, ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనపల్లి రోహిత్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మించడం జరిగిందని 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ఎక్కడ కూడా సరిగా ఇల్లు నిర్మించి ఇవ్వలేదని మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు, 10 సంవత్సరాలు పాలనకు అవకాశం కలిగిస్తే గత ప్రభుత్వం రాష్ట్రాన్ని మొత్తం అప్పులపాలు చేసిందని ఒక్కొక్క వ్యక్తిపై సుమారు రెండు నుంచి మూడు లక్షల రూపాయల అప్పు ఎత్తడం జరిగిందని ఆయన తెలిపారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి రెండున్నర సంవత్సరాలలో అనేక సంక్షేమ అభివృద్ధి సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్లో ప్రజా ప్రభుత్వం పేదల ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలను ఆదుకోవడం జరుగుతుందని, ఉచిత బస్సు,200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, తో పాటు రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఆయన అన్నారు, రెండున్నర సంవత్సరాలలో చిన్న శంకరంపేట మండలానికి సుమారు 20 కోట్ల రూపాయలు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ తహశీల్దార్ మాలతి, ఉప సర్పంచ్ భానుప్రసాద్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు మోహన్ నాయక్, జంగా రాయి సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పోతరాజు రమణ, సానా సత్యనారాయణ, యాదవరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాజ్ రెడ్డి, మనోజ్ కుమార్, యాదగిరి, శివకుమార్, రమేష్ గౌడ్, రాజాసింగ్, అక్బర్, రాజ్ కుమార్ గౌడ్, తీగుల్ల బిక్షపతి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## మన గ్రామాన్ని మనమే అభివృద్ధి చేసుకుందాం

- **మనమంతా ఒక్కటై గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చలేమా..?**
- **గ్రామ సర్పంచ్ చెక్కల పరమేశ్వర్**

**జగదేవపూర్, ఆశ్వి అప్డేట్స్**

మన గ్రామాన్ని మనమే అభివృద్ధి చేసుకుందామని .మనమంతా ఒక్కటై గ్రామాన్ని ఆదర్శం గ్రామంగా తీర్చుకోలేమా అని . గతంలో కాకుండా మన గ్రామానికి ఎవరైనా కొత్తవారు వచ్చి చూస్తే గ్రామానికి దత్తత తీసుకుంటామనే విధంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని దీనికి గ్రామస్తులంతా సహకరించాలని గ్రామ సర్పంచ్ చెక్కల పరమేశ్వర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం రోజున జగదేవపూర్ మండలంలోని బీజీ వెంకటాపూర్ గ్రామంలో బాలావికాస సంస్థ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా ఆయన మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరు గ్రామ సభకు హాజరు కావాలని ఈ సంస్థ కేవలం నిజమైన పేద గ్రామాలకే వారి సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. ఈ సంస్థ నుండి గ్రామానికి 80/ వరకు సహకారం అందిస్తుందని మిగిలిన 20/ గ్రామస్తులు నుండి పెట్టుబడులు పెట్టిస్తుందని తెలిపారు. మనమంతా సమష్టిగా కృషి చేసి గ్రామాన్ని మరో గంగాదేవిపల్లి గ్రామంగా తీర్చి దిద్దెలాల కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో గంగదేవిపల్లి పంచాయతీలకు నిలయంగా ఉండేది కానీ ప్రస్తుతం పరిష్కారాలకు నిలయంగా మారిందనీ ఆ గ్రామాన్ని చూడడానికి రెండు కళ్ళు చాలు అన్నట్టుగా ఉన్నదని ఆయన గ్రామస్తులకు వివరించారు. మన గ్రామాన్ని కూడా మరో గంగదేవిపల్లి గ్రామంగా తీర్చిదిద్దుకునేలా కృషి చేద్దామని గ్రామస్తులకు పిలుపునిచ్చారు .దీనికి ప్రతి ఒక్కరు సహకరిస్తే మన గ్రామాన్ని మనమే అభివృద్ధి చేసుకుందామని అన్నారు . దీనికి గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి పంచాయతీ ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బాలవికాస మేనేజర్ మంజుల, ప్రాజెక్టు కోటేటర్ రమేష్, డెవలప్మెంట్ ఏజెంట్స్ దుబ్బాసి రమేష్, మల్లం వెంకటేష్, తొగరి రమేష్, గ్రామ ఉప సర్పంచ్ పోకల బాబు, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్, ఆశా వర్కర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే!

**ఇదే తమ మొదటి డిమాండ్.. కొనసాగిస్తాం కూడా..**

- **ప్రవేశ పరీక్షల అవతవకలకు బాధ్యత వహించాల్సిందే**
- **కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే డిమాండ్**
- **జంతర్ మంతర్ వద్ద ధర్నా..**
- **పాల్గొన్న పర్యావరణవేత్త వాంగ్‌చుక్**





**న్యూఢిల్లీ, జూన్ 6 :** నీట్ తదితర ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారంనాడు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని సీజేపీ స్పష్టం చేసింది. సీజేపీ మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని నిలదీశారు. తమ డిమాండ్ల నెరవేరేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్టు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలని ఆయన ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్చలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డిలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు. పేపర్ లీక్‌లు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదవి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంతర్‌మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకుని కనిపించారు. జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉండాలని కోరారు. అయితే తనకు రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచన లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయ-ఎవేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటు న్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించడాన్ని ఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జరగాలని అన్నారు. కాగా, తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ఆలోచనలో సీజేపీ ఉంది. ఈ కార్యక్రమంలో వందలాదిమంది యువత పాల్గొని కాక్రోజ్ జనతాపార్టీకి మద్దుతగా నిలిచారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

**ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా సైన్యం**

**హోర్ముజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు**

**టెహ్రాన్, జూన్ 6:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్-అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.



# పశ్చిమాసియా ఉద్రిక్తతలు

**ప్రధాని మోదీ కీలక భేటీ**

**న్యూఢిల్లీ, జూన్ 6:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న అనిశ్చితి నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రధాన ఆర్థిక సలహా మండలి సభ్యులతో కీలక సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పై తగ్గించే మార్గాలతో పాటు దేశ ఆర్థిక వృద్ధిని మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో 'ఈజ్ ఆఫ్ లివింగ్', 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' సంస్కరణలను వేగవంతం చేయడం, ప్రపంచ ఆర్థిక ఒడిదుడుకులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడం, పెట్టుబడులకు మరింత అనుకూల వాతావరణం కల్పించడం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. పశ్చిమాసియా ఘర్షణల ప్రభావం భారత్‌తో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉండబోతుందన్న దానిపై మండలి సభ్యులు తమ అంచనాలను ప్రధానికి వివరించారు. ఇటీవల పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. హర్ముజ్ జలసంధి ప్రాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ పరిణామాలు అంతర్జాతీయ చమురు ధరలు, సరఫరా గొలుసులు, వాణిజ్య మార్గాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్‌కు అవసరమైన ఇంధన దిగుమతుల్లో గల్ఫ్ ప్రాంతం కీలక పాత్ర పోషిస్తున్నందున, అక్కడి పరిణామాలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోంది. చమురు ధరల పెరుగుదల, సరఫరా అంతరాయాలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన ముందస్తు చర్యలపై కూడా సమావేశంలో చర్చించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, ఆర్థిక అనిశ్చితుల మధ్య కూడా భారత్ వృద్ధి పథంలో ముందుకు సాగేందుకు అవసరమైన వ్యూహాలను రూపొందించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

# సహారా ఎడారిలో మృత్యు ఘోష

**నీళ్లు లేక 49మంది మృత్యువాత**



**సహారా, జూన్ 6:** పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మ-రమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు. చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలసవెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేక మంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తుచేసుకున్నారు.



# భార్యను తిడుతున్నారా... ఆలోచించండి!

భార్యభర్తల మధ్య గొడవలు రావటం సహజం. మాటమాట అనుకోవటం సహజం. కానీ, వివాదం వచ్చినప్పుడు నాదే పైచేయి కావాలన్న పట్టుదల ఉంటే, బంధం నిలవటం కష్టమవుతుంది. భార్యభర్తల మధ్య కొట్లాట జరుగుతున్నప్పుడు, భార్యను అనరాని మాటలతో, సూటిపోటి మాటలు అని ఆమె మనస్సును గాయాలయ్యేలా మాట్లాడుతారు. తరువాత పర్యవసనాలు ఎలా ఉంటాయో అస్సలు ఊహించరు. మాట జారితే వెనక్కి తీసుకోలేమని గుర్తుపెట్టుకోండి. ఎందుకంటే భర్తదే ఎప్పుడూ పైచేయి ఉండాలని కోరుకోవటం, పురుషాహంకారం ఇటువంటి సమయాల్లోనే మేల్కొవటం జరుగుతుంది కాబట్టి, భార్య మనస్సును నొప్పిస్తారు. తరువాత మీరు క్షమించమని అడిగినా, సారీ అని ప్రాథేయపడినా, ఆమె మనస్సుకు అయిన గాయాన్ని మాన్పలేరు. కాబట్టి, వాదనలో ఉన్నప్పుడు కొన్ని విషయాలను గుర్తుపెట్టుకొని మాట్లాడాలని తెలుసుకోండి.

### శత్రువులు కాదు.. పరుష మాటలు వద్దు!

భార్యభర్తల మధ్య గొడవలు రావటం సహజమని గుర్తుపెట్టుకోవాలి. పంతానికి పోయి.. శత్రువులుగా భావించకండి. వాదనలో ఉన్నప్పుడు భార్యను పరుష పదజాలంతో నిందించవద్దు. చిన్నచిన్న తగాదాలనే పెద్దగా మార్చుకోవద్దు. తప్పు ఇద్దరిలో ఎవరిదైనా సారీ అన్న చిన్నమాటతో, గొడవను తెంచేయండి.. ఇద్దరి మధ్య బంధాన్ని పెంచుకోండి. కొన్నిసార్లు చిన్నచిన్న గొడవలే విడిపోవటానికి కారణాలు అవుతాయని గుర్తించుకోండి. వివాదాన్ని సాధ్యమైనంత మేరకు సద్దుమణేగేలా చూడటానికే ట్రైన చేయండి.

### ఇతరుల వద్ద అవమానించకండి




ఇంటికి బంధువులు వచ్చినప్పుడో, లేదా మీ ఆఫీస్ నుంచో, మీ స్నేహితులనో ఇంటికి తీసుకువచ్చినప్పుడు భార్యను కించపరచేలా మాట్లాడకండి. ఏమీ చేతకాదు.. అన్నీ నేనే చెప్పాలి.. నేను లేకపోతే పని చేతకాదు, పుట్టింట్లో ఏం నేర్చారో కూడా తెలియదు అంటూ అవమానించకండి. నేను లేకపోతే అస్సలు ఒక్కపని కూడా జరగదని అందరి ముందూ భార్యను తక్కువ చేయకండి. ఇది ఆమె మనసుపై తీవ్ర ప్రభావాన్ని చూపించవచ్చు. కొందరైతే, బంధువలు, స్నేహితులు, కొలీగ్స్ ఉన్నారని మరీ రెచ్చిపోయి, తన ఆధిపత్యాన్ని చూపించుకోవటానికి భార్య తప్పులేకుండా తిడుతుంటారు. భార్య చులకన అయితే, మీరు కూడా చులకన అయిపోతారనీ, మీకు కనీస మర్యాద ఇవ్వరని గుర్తించుకోండి.

### ఇద్దరూ ఓడినట్లే

మీ భార్య హౌస్ వైఫ్ అయితే, ఆమె పనులు ఆఫీసులో కంటే ఇంట్లోనే ఎక్కువ ఉంటాయని అర్థం చేసుకోండి. ఏపనీ చేయటం లేదంటూ చులకనగా మాట్లాడకండి. వివాదాల్లో భర్తలు భార్య వల్ల రూపాయి ఉపయోగం లేదనీ, నా జీతంతోనే ఇల్లు నడుస్తోందంటూ గొప్పలకు పోతుంటారు. కానీ ఆమె అహిర్నిశలు ఇంట్లో కష్టపడటం వల్లే ఇల్లు సవ్యంగా ఉందని ఆమె కష్టాన్ని కూడా గుర్తించండి. వివాదంలో ఎవరు ఓడినా ఇద్దరూ ఓడినట్లేనని గుర్తించుకోండి.

# మొబైల్‌ను బాత్రూంలో వాడుతున్నారా ?

ప్రస్తుతం జనరేషన్ యువతకు మొబైల్ ఫోన్‌లో శరీరంలో ఒక భాగమైపోయింది. ఎక్కడికి వెళ్లినా? ఏం చేస్తున్నా? చేతిలో ఫోన్ ఉండాల్సిందే. ఫోన్ ఒక్క క్షణం కనిపించలేదంటే ప్రాణం పోయినంత ఫీల్ అవుతారు. నిద్ర లేచిన మరుక్షణం వాళ్లు చూసేది కూడా దీనిని. నిద్ర లేచినప్పటి నుంచి మళ్ళీ నిద్రలోకి జారుకునే వారకు వారి దృష్టి దీనిపై అధికంగానే ఉంటుంది. ఈ మధ్య చాలా మంది తమ మొబైల్ ఫోన్‌ను బాత్రూమ్‌లోకి కూడా తీసుకెళ్తున్నారు. అయితే.. మొబైల్ ఫోన్‌తో బాత్రూంకు తీసుకెళ్లే అలవాటు మిమ్మల్ని అనారోగ్యానికి గురి చేస్తుంది. మీరు లేక మీ కుటుంబ సభ్యులు టాయిలెట్ నుంచి ప్రమాదకర బ్యాక్టీరియాను ఇంట్లోకి తెస్తారు. ఇది పలు అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. అసలే కరోనా వైరస్ లాంటి వ్యాధులు ప్రపంచ దేశాలను కలవరానికి గురి చేస్తున్నాయి. గతంలో పెద్దవారిలో మాత్రమే కనిపించే పైల్స్ సమస్య ఇప్పుడు యువతో కూడా సాధరణమైంది. పైల్స్ సమస్య కారణంగా మీ మొబైల్‌ను టాయిలెట్‌కు తీసుకెళ్లడం చేస్తుంటారు. అయితే మీరు మొబైల్‌తో బాత్రూమ్‌లో కూర్చున్నప్పుడు, ఫోన్‌పైన మీ పూర్తి శ్రద్ధ ఉంటుంది. ఈ కారణంగా మీరు సాధారణ సమయం కన్నా అధిక సమయం టాయిలెట్‌లోనే కూర్చుంటారు. ఇలా చేయడం వల్ల హేమోరాయిడ్స్ అంటే పైల్స్ వచ్చే ప్రమాదం పెంచుతుంది. కాబట్టి ఇకనైనా మొబైల్ ఫోన్‌ను టాయిలెట్‌లోకి తీసుకువెళ్లకండి.



# ఒత్తిడిని పెంచే 11 ట్రిగర్స్



"ఉరుకుల పరుగుల జీవితమో, కార్పొరేట్ ఉద్యోగాల వల్లో.. కారణం ఏదైనా ప్రస్తుత సమాజానికి ఒత్తిడి అతిపెద్ద రోగంగా మారుతోంది. ఒకేసారి వందపనులు చేయాల్సిన పరిస్థితి అందరూ ఎదుర్కొంటున్నారు. ఈ ఒత్తిడిని ఎలా ఎదుర్కొవాలో? అసలు తమకు ఎందుకు ఒత్తిడి పెరుగుతోందో? కూడా అర్థం కాక చాలా మంది సతమతమవుతుంటారు. దీనిని హ్యాండిల్ చేయడం కోసం నానా తిప్పలు పడుతుంటారు. డాక్టర్ల దగ్గరకి వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేస్తారు. అయితే అసలు ఒత్తిడికి కారణమవుతున్న ట్రిగర్స్‌ను తెలుసుకుంటే దీనిని ఈజీగా హ్యాండిల్ చేయొచ్చని నిపుణులు అంటున్నారు. కృత్రిమ వెలుతురు నుంచి ఒకేసారి చాలా పనులు చేయడం వరకు, మన ఒత్తిడిని పెంచే కొన్ని విషయాలు ఉన్నాయి. వీటిని మనం 'కార్టిసాల్ ట్రిగ్గర్స్' అంటాం. కార్టిసాల్ అంటే 'ఒత్తిడి హార్మోన్' అని కూడా అంటారు. దీని స్థాయిలు పెరిగితే మనకు తీవ్రమైన ఒత్తిడి కలుగుతుంది. అయితే, మన రోజువారీ అలవాట్లు, జీవనశైలి ఎలా సైలెంట్‌గా కార్టిసాల్ స్థాయిలను పెంచుతాయో చాలా మంది గుర్తించరు. "దీర్ఘకాలికంగా కార్టిసాల్ స్థాయిలు ఎక్కువగా ఉంటే మీరు అలసిపోయినట్లుగా, చికాకుగా అనిపిస్తుంది. ఇది మెటబాలిజం, మానసిక స్థితి, జ్ఞాపకశక్తి, హార్మోన్లను దెబ్బతీస్తుంది. పొట్ట చుట్టూ కొవ్వు పెంచుతుంది. కండరాలను బలహీనపరుస్తుంది. ఆసక్తిని తగ్గిస్తుంది. నిద్రను పాడు చేస్తుంది. సెరోటోనిన్, డోపమైన్ వంటి సంతోషాన్నిచ్చే మెదడు రసాయనాలను అదుపు తప్పిస్తుంది" అని టామ్ ఒత్తిడి శరీరంపై చూపించే ప్రభావం గురించి వివరించారు."

**ఫోన్ నోటిఫికేషన్ శబ్దాలు:** ఫోన్ మోగేటప్పుడు లేదా వైబ్రేట్ అయినప్పుడు వచ్చే శబ్దాలు, ఏదో ఒక పని చేయాలనో, ఏదో ప్రమాదం ఉందనో మనసును ఆందోళనకు గురి చేస్తాయి. మనం వెంటనే స్పందించకపోయినా, మన నాడీ వ్యవస్థ దానికి ప్రతిస్పందిస్తుంది.
**గ్రూప్ టెక్ట్స్ మెసేజ్‌లు:** గ్రూప్‌లో ఇతరులు పంపిన టెక్ట్స్ మెసేజ్‌లతో సామాజికంగా కనెక్ట్ అయి ఉండాలని, అప్‌డేట్‌గా ఉండాలని మెదడు ఒత్తిడికి గురవుతుంది.
**నిరంతరాయంగా వచ్చే వాతావరణ శబ్దాలు:** తక్కువ స్థాయిలో బ్యాక్‌గ్రౌండ్ నాయిస్, అంటే కూలర్ సౌండ్ లేదా ట్రాఫిక్ శబ్దం వంటివి ఒత్తిడిని కలిగించగలవు.

**ఫోన్ నోటిఫికేషన్ శబ్దాలు:** ఫోన్ మోగేటప్పుడు లేదా వైబ్రేట్ అయినప్పుడు వచ్చే శబ్దాలు, ఏదో ఒక పని చేయాలనో, ఏదో ప్రమాదం ఉందనో మనసును ఆందోళనకు గురి చేస్తాయి. మనం వెంటనే స్పందించకపోయినా, మన నాడీ వ్యవస్థ దానికి ప్రతిస్పందిస్తుంది.

**గ్రూప్ టెక్ట్స్ మెసేజ్‌లు:** గ్రూప్‌లో ఇతరులు పంపిన టెక్ట్స్ మెసేజ్‌లతో సామాజికంగా కనెక్ట్ అయి ఉండాలని, అప్‌డేట్‌గా ఉండాలని మెదడు ఒత్తిడికి గురవుతుంది.

**నిరంతరాయంగా వచ్చే వాతావరణ శబ్దాలు:** తక్కువ స్థాయిలో బ్యాక్‌గ్రౌండ్ నాయిస్, అంటే కూలర్ సౌండ్ లేదా ట్రాఫిక్ శబ్దం వంటివి ఒత్తిడిని కలిగించగలవు.

**తప్పుడు సమయంలో కృత్రిమ వెలుతురు:** ఉదయం పూట మనకు సహజమైన సూర్యరశ్మి దొరకనప్పుడు, పగటిపూట కృత్రిమ లేదా LED లైట్ల వెలుతురు మన శరీరం యొక్క కార్టిసాల్ లయను దెబ్బతీస్తుంది.

**ఎక్కువ మోటివేషనల్ కంటెంట్:** మనం ఎక్కువ మోటివేషనల్ కంటెంట్, హజిల్ కల్చర్ రీల్స్‌కు గురైనప్పుడు, మెదడు వాటిని ప్రమాదాలుగా అర్థం చేసుకుంటుంది. మనం తగినంత కృషి చేయడంలేదని భావిస్తాం.

**ఒకేసారి చాలా పనులు చేయడం:** ఒకటి కంటే ఎక్కువ పనులు ఒకేసారి చేస్తే పనులు తొందరగా అయిపోతాయని అనుకుంటాం. కానీ అది మనసులో ఒక రకమైన గందరగోళాన్ని సృష్టిస్తుంది.

**సోషల్ మీడియాను ఆసక్తి లేకుండా చూడటం:** సోషల్ మీడియాలో ఏదో చూస్తున్నామని తెలియకుండా స్క్రోల్ చేస్తూ పోతే, అది శరీరంలో కార్టిసాల్ స్థాయిలను పెంచడం, తగ్గించడం వంటివి చేస్తుంది.

**వడపోత లేని వార్తలు లేదా సంక్షోభ హెడ్‌లైన్‌లు:** మనపై ప్రభావం చూపడం లేదని మనం అనుకున్నా, 5 నిమిషాల పాటు భయానక వార్తలను చూడటం కొన్ని గంటల పాటు మన కార్టిసాల్ స్థాయిలను ప్రభావితం చేస్తుంది.

**ఒకే భంగిమలో ఎక్కువసేపు కూర్చోవడం:** నిశ్చల జీవనశైలి రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుంది. కీళ్లలో ఒత్తిడిని సృష్టిస్తుంది. అలాగే కార్టిసాల్ స్థాయిలను కూడా దెబ్బతీస్తుంది.

**విసుగు:** దీర్ఘకాలికంగా విసుగు, సృజనాత్మక ఉత్సాహం లేకపోవడం మానసిక ఒత్తిడికి దారితీస్తుంది.

**వైఫై ఓవర్‌లోడ్:** మనం నిద్రపోతున్నప్పుడు వైర్‌లెస్ సిగ్నల్‌స్‌కు నిరంతరం గురికావడం మెదడు యొక్క కార్యకలాపాలను ప్రభావితం చేస్తుంది.

